ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



తూర్పుగోదావరి

జిల్లా వార్తలు

మంగళవారం 11 నవంబరు 2025 | 5









కార్తీక దీపోత్సవం

పవిత్ర గోదావరి తీరం రాజమహేంద్రవరం కోటిలింగాల ఘాట్‌లో లక్ష దీపోత్సవం కన్నుల పండువగా సాగింది. ఉమాకోటిలింగేశ్వర స్వామి దేవస్థానం, పందిరి మహదేవుడు సత్రం, పంతం సత్యనారాయణ చారిటబుల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించారు. సోమవారం సాయంత్రం 6 గంటలకు కార్యక్రమం ప్రారంభించారు. ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు, ఎమ్మెల్సీ సోము వీర్రాజు, కమిషనర్ రాహుల్‌మీనా పాల్గొన్నారు.

హరోం..హర









రాజమహేంద్రవరం గోదావరిలో సోమవారం తెల్లవారుజామున 3 గంటల నుంచే పెద్ద ఎత్తున భక్తజనం కార్తీక పుణ్యస్నానాలు చేశారు. కోటిలింగాల రేవు, పుష్కరాల రేవు, టీటీడీ ఘాట్, సరస్వతి ఘాట్, గౌతమి ఘాట్లలో భక్తులు సాన్నాలు చేసి కార్తీక దామోదర పూజ చేసి దీపాలు వెలిగించి నదిలో విడిచిపెట్టారు. అనంతరం శివాలయాలకు చేరుకుని ప్రత్యేకాభిషేకాలు, అర్చనలు చేశారు. - రాజమహేంద్రవరం సిటీ



కమిషనర్ రాహుల్ మీనాకు సమస్యను వివరిస్తున్న రైల్వే స్టేషన్ మేనేజర్

రైల్వే స్టేషన్‌లో కుక్కలను పట్టించండి

కమిషనర్‌కు విన్నపం

రాజమహేంద్రవరం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): రాజమండ్రి రైల్వే స్టేషన్‌లో వీధి కుక్కలను నియంత్రించాలని కమిషనర్ రాహుల్ మీనాకు స్టేషన్ మేనేజర్ రంగనాథ్, సీటీఐ చంద్రమౌళి సోమవారం వినతిపత్రం అందజేశారు. రైల్వే స్టేషన్‌లోని వీధి కుక్కల నియంత్రణ లేకపోవడం వల్ల ప్రయాణికులు ప్రమాదాల బారిన పడుతున్నారని సోమవారం 'ఆంధ్రజ్యోతి' కథనంలో పేర్కొనడం గమనార్హం.ఇదిలా ఉండగా వీధి శునకాల వల్ల ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారని, ప్రమాదాలకు గురవుతున్నారని కమిషనర్‌కి స్టేషన్ మేనేజర్ తెలిపారు. ప్రయాణికుల భద్రత దృష్ట్యా తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు.

నేడు ఎఫ్ఎఫ్‌సీ వర్చువల్‌గా ప్రారంభించనున్న సీఎం

రాజమహేంద్రవరం నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ధవళేశ్వరం పారిశ్రామిక వాడలో ఏర్పాటు చేస్తున్న ప్లేటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్‌ను మంగళవారం ఉదయం సీఎం చంద్రబాబు వర్చువల్‌గా ప్రారంభించనున్నారు. అసెంబ్లీ నియోజకవర్గానికి ఒక ఎంఎస్ఎంఈ పారిశ్రామిక పార్కు స్థాపనలో భాగంగా ఈ ఫ్యాక్టరీ ఏర్పాటు చేస్తున్నారు. ఎమ్మెల్యే గోరంట్ల తదితరులు పాల్గొంటారు.



విజిట్రబుల్స్!

కూరగాయలు అధరహో

రాజమహేంద్రవరం అర్బన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : కార్తీకమాసం ఎఫెక్ట్ కూరగాయల ధరలపై పడింది.. ఒక్కసారిగా ఆకాశాన్నంటాయి. ఏ రకం చూసినా కిలో రూ.50లకు తక్కువ లేదు. అన్ని కూరగాయల ధరలు రూ.50ల పైనే పలుకుతున్నాయి. రైతు బజార్‌లో బెండకాయలు, దొండకాయలు, బీరకాయలు కిలో రూ.50ల చొప్పున విక్రయిస్తున్నారు. నల్ల వంకాయలు రూ.80ల వరకూ విక్రయిస్తున్నారు. తెల్లవంకాయలు కాస్త ధర తక్కువగా ఉన్నాయి. దీంతో రైతు బజార్‌కు వచ్చిన జనం ధరలు చూసి బేజారవుతున్నారు. సామాన్యులే కాదు మధ్యతరగతి వర్గాలు సైతం బెంబేలెత్తిపోతున్నారు. ఒకటికి రెండు సార్లు ధరలు తెలుసుకుంటున్నారు. బహిరంగ మార్కెట్లో కిలో వంకాయలు రూ.100పైనే పలుకుతుంటే ఇతర కూరగాయలు సైతం కిలో రూ.80 నుంచి రూ.100ల వరకూ విక్రయిస్తున్నారు. కనీసం పావుకిలో కొందామన్నా ఏ కూరగాయ కూడా రూ.25లకు తక్కువకు రావడంలేదు. ఈ ధరలు చూసి ప్రజలకు నోటమాట రావడంలేదు. బహిరంగ మార్కెట్లతో పోల్చితే రైతు బజార్లలో ధరలు కాస్త తక్కువగానే ఉన్నా కూరగాయల నాణ్యతపై ప్రజలు పెదవి విరుస్తున్నారు.సచ్చులు, పుచ్చులు తప్ప అక్కడేమీ ఉండడంలేదనే విమర్శలు వస్తున్నాయి. కార్తీకమాసానికి తోడు ఇటీవలి మొంథా తుఫాన్ దెబ్బ కూరగాయల ధరలపై పెను ప్రభావం చూపుతోందనే చెప్పాలి. ఆకుకూరల పరిస్థితి దారుణంగా ఉంది. మొంథా తుఫాన్ దెబ్బకు పాదు కూరలన్నీ తుడుచుపెట్టుకుని పోవడం, ఇతర కూరగాయల మొక్కల పువ్వు, పిందె రాలిపోవడం ధరలు భారీగా పెరుగుదలకు ప్రధాన కారణంగా రైతులు చెబుతున్నారు.

బహిరంగ దోపిడీ

రిటైల్ మార్కెట్లలో ధరలు ఇష్టారాజ్యంగా ఉన్నాయి. సెమీ హోల్‌సేల్ మార్కెట్లలో కిలో వంకాయల ధర రూ.100లు ఉంటే రిటైల్ మార్కెట్లలో పావు కిలో రూ.30లకు విక్రయిస్తున్నారు. అంటే కిలో రూ.120. బీరకాయలు, బెండకాయలు, దొండకాయల ధరలు అనూహ్యంగా పెరిగి కిలో రూ.80పైనే ఉన్నాయి. టమాటా కిలో రూ.40 ధర ఉన్నా నాణ్యత ఉండడంలేదు. అరటికాయల ధర పెరిగిపోయింది. మీడియం సైజులో ఉండే రెండు కాయలు రూ.25లు చెబుతున్నారు. రైతు బజార్లలో కూరగాయల నాణ్యత ఎంత తక్కువ చెప్పుకుంటే అంత మంచిది. ధర తక్కువైనా నాణ్యత లేకపోవడంతో ప్రజల్లో అసంతృప్తి వ్యక్తమవుతోంది.

- కూరగాయలకు కార్తీకం ఎఫెక్ట్
- భారీగా పెరిగిన ధరలు
- ఏ రకమైనా కిలో రూ.50పైనే
- కిలో వంకాయ రూ.100
- బహిరంగ మార్కెట్‌లో దోపిడీ
- కొనుగోలుదారులు లబోదిబో

మరో నెల ఇంతేగా..

బీర, బెండ, దొండ, ఆనబ వంటి పాదు కూరలు, టమోటా, ఇతర కూరగాయల పంటలు మొన్నటి మొంథా తుఫాన్ దెబ్బకు తుడిచిపెట్టుకుపోవడంతో సీతానగరం, కడియం మండలాల్లో కూరగాయలు సాగు చేసే రైతులు ఇప్పుడిప్పుడే మళ్లీ కొత్తగా నార్లు పోస్తున్నారు. వాతావరణ పరిస్థితులన్నీ అనుకూలించి ఇవన్నీ కాపునకు వచ్చేసరికి ఎంతలేదన్నా నెలరోజులు పైనే పడుతుందని చెబుతున్నారు. తాళ్లపూడి మండలం పెద్దేవంలో ఆకు కూరలసాగు పెద్దఎత్తున జరుగుతుంది. తుఫాన్ వర్షాల దెబ్బతో ఒక్క గోంగూర మినహా ఇతర అన్ని ఆకుకూరలు, కొత్తిమీర, పుదీనా పూర్తిగా ధ్వంసమైంది. లోకల్ టమోటా నారు కుళ్లిపోయింది. రైతులు మళ్లీ నారు పోస్తున్నారు. నిజానికి నవంబరు నుంచి లోకల్ టమోటా మార్కెట్లోకి రావాల్సి ఉంది. ఇది కూడా ఆలస్యం కానుంది. లోకల్‌గా కూరగాయల దిగబడులు లేకపోవడం,రావులపాలెం, మడికి చుట్టుపక్కల గ్రామాల్లో పండించే సరుకు ఒక్కటే ఇక్కడి అన్ని మార్కెట్లకు రావడంతో డిమాండ్ పెరిగి ధరలు తారస్థాయికి చేరుతున్నాయి.మరో నెలరోజులు కూరగాయాలు తప్పేలా లేదని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



12 ఎకరాల ప్రభుత్వ భూమి ఆక్రమించారని కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న బీజేపీ నాయకులు

పీజీఆర్ఎస్‌కు 185 అర్జీలు

రాజమహేంద్రవరం రూరల్ నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలు పరిష్కార దిశగా అధికారులు పనిచేయాలని కలెక్టర్ కీర్తి చేకూరి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో 185 అర్జీలు స్వీకరించినట్టు తెలిపారు. ప్రజలు తమ అర్జీలను డివిజన్, మండల స్థాయిలో ఉన్న అధికారులకు అందజేస్తున్నా ఫలితం లేకపోవడం వల్ల కలెక్టరేట్‌కు వస్తున్నారన్నారు. జిల్లా రెవెన్యూ అధికారులు బాధ్యతగా వ్యవహరించాలన్నారు. కార్యక్రమంలో జేసీ మేఘస్వరూప్,డీఆర్‌వో సీతారామమూర్తి, సీపీవో అప్పలకొండ, డిఎల్‌డీవో వీణాదేవి పాల్గొన్నారు.

12 ఎకరాల ప్రభుత్వ భూమి ఆక్రమణ..

కొవ్వూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): తుపాకులగూడెం సర్వే నెంబరు 264 ప్రభుత్వ భూమిలో చేపట్టిన అక్రమ కట్టడాలను తొలగించాలని బీజేపీ నాయకులు సోమవారం జిల్లా కలెక్టర్‌కు విన్నవించారు.తాళ్లపూడి మండలం పోచవరం, తుపాకులగూడెం గ్రామంలో సర్వే నంబరు 264లో 12 ఎకరాల ప్రభుత్వ భూమిని కొంత మంది వ్యక్తులు ఆక్రమించుకుని అక్రమ కట్టడాలు నిర్మాణం చేపట్టారన్నారు. ప్రశ్నించిన వారిపై అట్రాసిటీ కేసులు పడతానని బెదిరిస్తున్నారన్నారు. రాజకీయ నాయకుల అండదండలతో ప్రభుత్వ భూమిని ఆక్రమించుకోవడంతో పాటు ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో ఆ కట్టడాలకు సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టారన్నారు.స్థానిక తహశీల్దార్‌కు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడంతో కలెక్టరేట్‌కు వచ్చామన్నారు. అక్రమ కట్టడాలను తొలగించి, నిర్మాణం చేపట్టిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. 12ఎకరాల ప్రభుత్వ అనాక్రాంతం కాకుండా చర్యలు చేపట్టాలన్నారు.ఉపాధి నిధులు దుర్వినియోగం చేసిన అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కె.వెంకట సత్యనారాయణ, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

ఎస్పీ గ్రీవెన్స్‌కి 40 ఫిర్యాదులు

రాజమహేంద్రవరం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం పబ్లిక్ గ్రీవెన్స్ నిర్వహించారు. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి 40 అర్జీలను ఎస్పీ నరసింహ కిశోర్ స్వీకరించి సమస్యలపై ఆరా తీశారు. సంబంధిత స్టేషన్ బాధ్యులతో ఫోన్‌లో మాట్లాడి సత్వరమే చట్ట పరిధిలో పరిష్కారం చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీలు ఎన్‌బీఎం మురళీకృష్ణ, ఏవీ సుబ్బరాజు పాల్గొన్నారు.

మొంథా నష్టంపై ప్రభుత్వానికి నివేదిక


మొంథా తుఫాన్ నష్టాలపై కేంద్రం బృందం పర్యటన



చిట్యాలలో తుఫాన్ బాధిత రైతులతో మాట్లాడుతున్న కేంద్ర బృంద సభ్యులు, కలెక్టర్ కీర్తి తదితరులు

రాజమహేంద్రవరం/గోపాలపురం,నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో మొంథా తుఫాన్ నష్టాలపై ప్రభుత్వానికి నివేదిక ఇస్తామని కేంద్ర బృందం ప్రకటించింది.కలెక్టరేట్‌లో సోమవారం రాత్రి జిల్లాలో జరిగిన నష్టంపై సమీక్షించింది.కలెక్టర్ కీర్తి చేకూరి ఆధ్వర్యంలో తుఫాన్ ప్రభావిత నష్టాలకు సంబంధించిన ఫొటో ప్రదర్శనను కేంద్ర బృందం తిలకించింది. కేంద్ర బృందం సభ్యుడైన కేంద్ర వ్యవసాయ రైతు సంక్షేమ శాఖ డైరెక్టర్ కె.పొన్నుస్వామి మాట్లాడుతూ చిట్యాల గ్రామం సహా పలు గ్రామాల్లో పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయన్నారు. రైతులు ఇబ్బందులను కేంద్ర ప్రభుత్వానికి నివేదిస్తామన్నారు. సీడబ్ల్యూసీ డైరెక్టర్ శ్రీనివాస బైరి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా యంత్రాగం ప్రాణ నష్టం జరుగకుండా సమర్థవంతంగా వ్యవహరించారన్నారు. కలెక్టర్ కీర్తి చేకూరి జిల్లాలో నష్టాలు వివరించారు. జిల్లాలో వ్యవ సాయ, ఉద్యాన శాఖలకు భారీ నష్టం వాటిల్లిందన్నారు. జిల్లాలో 17 మండలాలు, 3 పట్టణాల పరిధిలో 653 గ్రామాలకు చెందిన 27,140 మంది ప్రజలు తుఫాన్ వల్ల నష్టపోయారన్నా రు. జిల్లాలో 31,074 మంది రైతులకు చెందిన 15665 హెక్టార్లలో పంట నష్టం జరిగిందని తెలిపారు. అందులో 14529 హెక్టార్లలో వరి పంట, 1135 హెక్టార్లలో మినుము పంట దెబ్బతిందని 2802 హెక్టార్లలో ఉద్యాన పంటలు దెబ్బతిన్నాయన్నారు. విద్యుత్ శాఖకు సంబంధించి 45 సబ్‌స్టేషన్లు, 470 విద్యుత్ స్తంభాలు 270 ఎల్‌టీ లైన్లు, ఫీడర్లు దెబ్బతిన్నాయన్నారు. ఎర్రకాలువ ప్రవాహం వల్ల తీవ్ర నష్టం జరిగిందని తెలిపారు. మొత్తం 21 ప్రాంతాల్లో కాల్వలు, రేవులు, రోడ్డు మార్గాలు దెబ్బతిన్నాయని తెలిపారు.గోపాలపురం మండలం చిట్యాల, వెంకటాయపాలెం గ్రామాల్లో 540 హెక్టార్లలో పంట నష్టం జరిగిందని తెలిపారు. కొవ్వాడ కాల్వ కారణంగా గత 30 ఏళ్లుగా పంటను నష్టపోతున్నారని బృందం దృష్టికి తీసుకెళ్లారు. సీఈఈఏ డిప్యూటీ డైరెక్టర్ ఆర్తీ సింగ్, గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ ఏడీ మనోజ్ కుమార్ మీనా, తదితర కేంద్ర బృంద సభ్యులు పర్యటించారు. వారి వెంట రాష్ట్ర అధికారి డిల్లీరావు, జేసీ మేఘా స్వరూప్, ఆర్‌డీవో రాణి సుష్మిత,జిల్లా వ్యవసాయాధికారి ఎస్.మాధవరావు, సివిల్ సప్లయిస్ మేనేజర్ గణేశ్‌కుమార్,ఏవో ఏసుబాబు,ఎస్ఐమనోహర్ ఉన్నారు.

ఎక్కడికక్కడ హై అలర్ట్





రాజమహేంద్రవరంలో సోమవారం అర్ధరాత్రి తనిఖీలు చేస్తున్న పోలీసులు

రాజమహేంద్రవరం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీలో బాంబు పేలుళ్ల నేపథ్యంలో దేశ వ్యాప్తంగా హై అలర్ట్ ప్రకటించడంతో జిల్లాలోని పోలీసులు అప్రమత్తమయ్యారు. జిల్లా కేంద్రంతో పాటు, జిల్లాలోకి ప్రవేశ, నిర్గమ మార్గాల్లో హుటాహుటిన చెకపోస్టులను ఏర్పాటు చేశారు. వాహనాలను క్షణ్ణంగా తనిఖీలు చేశారు. డాగ్ స్క్వాడ్, బాంబ్ డిస్పోజల్ స్క్వాడ్‌లను రంగంలోకి దింపారు. అనుమానిత ప్రదేశాల్లో కలియ తిరిగారు. అనుమానితులను ప్రశ్నిస్తున్నారు. మరోవైపు రైల్వే స్టేషనులో ఆర్పీఎఫ్, జీఆర్పీ పోలీసులు తనిఖీలు చేపట్టారు.

అనుమానం వస్తే కాల్ 112 : ఎస్పీ



జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో అప్రమత్తం చేశాం. ప్రత్యేక బృందాలను రంగంలోకి దించాం. విస్తృతంగా వాహన తనిఖీలు చేస్తున్నాం. అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే 112కి ఫోన్ చేయాలి. అనవసర వదంతులు వద్దు.



వెరీ.. వెరీ.. గుడ్డు



కార్తీకంలోనూ అధరహో

- ఒక్కో గుడ్డు హోల్‌సేల్ రూ.6
- రిటైల్‌లో రూ.7కి విక్రయం
- ధరలకు రెక్కలు
- వినియోగదారులకు చుక్కలు
- పౌల్ట్రీ రైతులకు ఊరట
- కూరగాయలతో పోటీ
- లాభాల్లో రైతాంగం

మండపేట, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ఎన్నడూ లేనిది కార్తీకమాసంలో గుడ్డు ధర పరుగులు పెడుతోంది. ప్రతి ఏడాది కార్తీకమాసంలో గుడ్డు ధర తక్కువగా ఉండేది. ఎందుకంటే ఈ మాసంలో శాకాహారులు ఎక్కువగా ఉంటారు. దీంతో ఎప్పుడూ గుడ్డు ధర తక్కువగా ఉండేది. అయితే దానికి భిన్నంగా ఈ ఏడాది మాత్రం పరుగులు పెడుతోంది. కోళ్ల ఫారాల నిర్వాహకులకు లాభాలు పండిస్తుంటే సామాన్యుడు మాత్రం గుడ్డు తినలేని పరిస్థితి కనిపిస్తోంది. గత రెండేళ్ల పాటు పౌల్ట్రీ పరిశ్రమ ఒడిదుడుకులు చెందగా ఇప్పుడిప్పుడే పరిశ్రమ కుదుటపడుతోంది. గతంలో పరిశ్రమ నష్టాల కారణంగా చాలా మంది రైతులు కోళ్ల ఫారాలను మూసివేశారు.కొంతమంది అయితే బ్యా చ్‌లు వేయలేదు. గతంలో అయితే బ్యాచ్‌లు వేసి గుడ్ల ఉత్పత్తి చేసేవారు. ప్రస్తుతం ఉత్పత్తి తగ్గడంతో డిమాండ్‌కు సరిపడా సరుకు లేకపోవడంవల్ల ధరలు పెరుగుదలకు కారణ మని నిర్వాహకులు చెబుతున్నారు. ఒక గుడ్డు ఉత్పత్తికి రూ.4.80 పైసలు అవుతుంది. రూ.5 దాటి ధర ఉంటేనే గిట్టుబాటు ఉంటుందని పౌల్ట్రీ రైతులు అంటున్నారు.

గతేడాది రూ.5.65

కార్తీకమాసంలో కాయగూరల ధరలు ఆకా శాన్నంటుతున్నాయి. కనీసం గుడ్డు కొనుగోలు చేసి కూర వండుకుందామంటే బయట రూ.7 నుంచి రూ.7.50 వరకు విక్రయిస్తున్నారు. దీంతో గుడ్డు కూడా తినలేని పరిస్థితి నెలకొందని వినియోగదారులు వాపోతున్నారు. గతేడాది నవంబరులో గుడ్డు ధర రూ.5.65 ఉండగా ఇప్పుడు ఇదే మాసంలో రూ.6కి చేరింది. చిల్లరగా గుడ్డు ధర బయట మార్కెట్‌లో రూ.6.50 నుంచి రూ.7లకు వరకు విక్రయిస్తున్నారు.మొత్తం మీద కార్తీకంలో గుడ్డు ధర నిర్వాహకులకు ఊరటనిస్తుంటే కొనుగోలు దారులకు మాత్రం నీరసం కలిగిస్తోంది.

గుడ్డు ధర ఊరట



ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 300 వర కు కోళ్ల ఫారాలు ఉన్నాయి. వీటిలో 1.40 కోట్ల మేర కోళ్లను పెంచుతున్నారు.రోజుకు 1.10 కోట్ల మేర గుడ్లు ఉత్పత్తి జరుగుతోంది. 40 శాతం స్థానిక అవసరాలకు వినియోగిస్తుండగా 60 శాతం గుడ్లు పొరుగు రాష్ట్రాలైన ఒడిశా, బీహార్, పశ్చిమ బెంగాల్ తదితర రాష్ట్రాలకు ఎగుమతులు జరుగుతుంటాయి. ప్రభుత్వం అంగన్‌వాడీలు, పాఠశాలలు, వసతిగృహాలు, ఆస్పత్రుల్లో గుడ్లు అందిస్తోంది. ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, బేకరీలు, ఇంట్లోని వంటకాల్లో కూరలకు గుడ్లు విరివిగా వాడుతున్నారు. గుడ్డు భలే ఫుడ్ అన్నట్టుగా మారింది. డిమాండ్‌కు తగ్గట్టుగా గుడ్ల ఉత్పత్తి లేకపోవడంతో పాటు శీతాకాలం కావడంవల్ల వినియోగం పెరిగిందని నిర్వాహకులు చెబుతున్నారు. కొన్నేళ్లుగా కోళ్ల పరిశ్రమ నష్టాల్లో కూరుకుపోగా ఇప్పుడు కాస్తంత పెరిగిన గుడ్డు ధర ఊరటనిస్తోందని పౌల్ట్రీ నిర్వాహకుడు తాడి శేషారెడ్డి తెలిపారు. కాసింత లాభాలు చూస్తున్నామన్నారు.

రాయితీలు కల్పించాలి

పరిశ్రమలో కోళ్లకు వాడే మేతల ధరల పెరుగుదల, మందుల ధరలు పెరగడం భారంగా మారిందని నిర్వాహకులు చెబుతున్నారు. కోళ్ల మేతలకు సంబంధించి ముడిసరుకు ధరలు పెరగడం తమకు భారంగా మారాయని నిర్వాహకులు చెబుతున్నారు. 2019లో ముడిస రుకు ధరలు తక్కువ ఉండడం వల్ల లాభాలు వచ్చాయని అంటున్నారు. ఇప్పుడు పెరిగిన దాణాల ధరలు తమకు భారంగా మారాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పొరుగు రాష్ట్రాలైన యూపీ, వెస్ట్ బెంగాల్, ఒడిస్సా తదితర రాష్ట్రాల్లో సబ్సిడీలు ఇస్తుండగా ఇక్కడ మాత్రం ఇవ్వడం లేదు. దానివల్ల ఇక్కడ రైతులు మార్కెట్ ధరపైనే ఆధారపడాల్సి వస్తోంది. పొరుగు రాష్ట్రాల్లా ఇక్కడా ప్రభుత్వం కోళ్లపరిశ్రమలకు రాయితీలు కల్పించాలని, ముడిసరుకు ధరల నియంత్రణకు చర్యలు తీసుకుని ఆదుకోవాలని పౌల్ట్రీ నిర్వాహకులు విజ్ఞప్తి చేస్తున్నారు.



సైన్సును.. విందాం.. కందాం!

అనంత విశ్వం, భూగోళం, ఖగోళం, సముద్రాల లోతు, ప్రపంచ దేశాలు, అక్కడి వాతావరణ పరిస్థితులు.. కొండలు, కోనలు.. జంతువులు, భూమి, నీరు, మంచు.. ఇలా ఒకటేమిటి ఒక్కసారిగా ప్రపంచంలోని అన్నింటి గురించి వినొచ్చు.. చూడొచ్చు.. అంటే ప్రపంచాన్నే చుట్టివచ్చేయొచ్చన్న మాట.. దీనికి ఎక్కడికో వెళ్లక్కర్లేదు. రాజమహేంద్రవరం సైన్స్ సెంటర్‌కి వెళ్తే చాలు.. ఇక్కడి గ్యాలరీల్లో వాటన్నింటినీ వర్చువల్‌గా చూడొచ్చు. ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల విద్యార్థులకు ఉపయోగపడేలా రాజమహేంద్రవరంలోని బొమ్మూరులో విజ్ఞాన కేంద్రం(సైన్స్ మ్యూజియం)ను నిర్మించారు.

అటు వినోదం.. ఇటు విజ్ఞానం

- విద్యార్థులకు ఎంతో ఉపయుక్తంగా రాజమహేంద్రవరం ప్రాంతీయ విజ్ఞాన కేంద్రం
- బొమ్మూరులో ఐదెకరాల స్థలంలో ఏర్పాటు
- ప్రపంచంలోని అనేక విషయాలపై పరిజ్ఞానం
- సైన్స్ సెంటర్‌కు తరలివస్తున్న విద్యార్థులు

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

రాజమహేంద్రవరం విజ్ఞాన కేంద్రం(సైన్స్ మ్యూజియం) విద్యార్థులను బాగా ఆకర్షిస్తోంది. ప్రతిరోజూ ఆయా ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలనుంచి విద్యార్థులు వచ్చి ఈ కేంద్రాన్ని సందర్శించి ఉత్సాహంతో వెళ్తున్నారు. విద్యార్థులు ప్రయోగాలు చేయడానికి అనుకూలమైన మ్యూజియంఇది. ఇక్కడ వినోదంతోపాటు విజ్ఞానం కూడా పొందవచ్చు. ఇక్కడ పెద్ద విజ్ఞాన పార్కు కూడా ఉండడంతో అందరూ సంతోషంగా ఆడుకుంటున్నారు. ఈ ప్రాంతీయ విజ్ఞాన కేంద్రాన్ని గత జూన్ 26న కేంద్రమంత్రి షెకావత్, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ప్రారంభించగా ఎంపీ పురందేశ్వరి, పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేష్, ఎమ్మెల్యేలు గోరంట్ల బుచ్చయ్యచౌదరి, ఆదిరెడ్డి వాసు పాల్గొన్నారు. సైన్సు సెంటర్‌పై మొదట్లో అంతగా ప్రచారం లేక ప్రజల్లోకి అంతగా వెళ్లలేదు. ఇటీవల దీనిపై అవగాహన పెరగడంతో తూర్పుగోదావరి జిల్లాలోని అన్ని పాఠశాలలు, కళాశాలల నుంచి ప్రతిరోజూ ఏదో పాఠశాలనుంచి విద్యార్థులు వస్తున్నారు. ఇక్కడ ఉండే వాటిపై పూర్తిగా వివరించి చెప్పేవారు ఉంటే విద్యార్థులకు మరింత ఉపయుక్తంగా ఉంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.



ఎన్నెన్నో వింతలు

ఈ విజ్ఞాన కేంద్రాన్ని ఐదెకరాల స్థలంలో రూ.10 కోట్లతో నిర్మించారు. ఈ సైన్స్ కేంద్రం ఓ అద్భుతం..సైన్స్ పరికరాలు,జ్ఞాన సమాచారం.. ప్రయోగశాలలు ఏర్పాటుచేశారు. ఈ భవనాన్ని జీప్లస్ -1గా నిర్మించారు.గ్రౌండ్ ఫ్లోర్‌లో మూడు రూమ్‌లున్నాయి. ఫస్ట్ ఫ్లోర్‌లో ఆరు గ్యాలరీలున్నాయి. ఆడిటోరియం, కాన్ఫరెన్స్ హాల్ ఉంది. సాంకేతికపరమైన 18ఎగ్జిబిషన్లు ఉన్నాయి. ఓపెన్ గ్రౌండ్‌లో సైన్స్ పార్కు ఉంది. రసనియాన్స్ గ్యాలరీలో ఫిజిక్స్, మాథ్స్‌కి సంబంధించిన 33 విజ్ఞాన అంశాలు ఉన్నాయి. అటవీ, పర్యావరణం, సైన్స్ అండ్ టెక్నాలజీ కోసం మరో నిర్మాణం కూడా చేయనున్నారు. వాటర్ వర్రీస్ గ్యాలరీలో వర్చువల్ మ్యూజియం, మరో 35ఎగ్జిబిషన్లు ఉన్నాయి.సౌండ్, చిత్రాల సేకరణ, ఖగోళ వస్తువులు, సాంకేతిక,శాస్త్రీయ, పారిశ్రామిక పురోగతికి సంబంధించిన 32 ప్యానెళ్లు ఉన్నాయి. ఎ జర్నీ విత్ లైట్ బై స్పేస్, గెలాక్సీ గ్రహాలతో కూడిన 20 ప్యానెల్స్ ఉన్నాయి.




పలు అంశాలను ఆసక్తిగా తిలకిస్తున్న విద్యార్థులు

ఏపీసీఓఎస్‌టీ నిర్వహణలో..

కేంద్ర సాంస్కృతిక మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలోని నేషనల్ కౌన్సిల్ ఆఫ్ సైన్స్ మ్యూజియంలోని ఒక యూనిట్ అయిన విశ్వేశ్వరయ్య ఇండస్ట్రియల్ అండ్ టెక్నాలజికల్ మ్యూజియం, స్కీమ్ ఫర్ ప్రమోషన్ ఆఫ్ కల్చర్ ఆఫ్ సైన్స్(ఎస్‌పీవోసీఎస్) పథకం కింద ఆంధ్రప్రదేశ్ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ(ఏపీసీవోఎస్‌టీ) ఆధ్వర్యంలో దీన్ని నిర్మించారు. ప్రస్తుతం ఇది ఏపీసీఓఎస్‌టీ ఆధ్వర్యంలో నిర్వహణలో ఉంది.

రోజూ సందడి

విద్యార్థులతో ఇక్కడ రోజూ సందడిగానే ఉంటుంది. జూన్‌నుంచి ఇప్పటివరకూ 25వేలమందికిపైగా ఈ కేంద్రాన్ని సందర్శించినట్లు ఇక్కడ ఇన్‌చార్జి అయిన డీఈవో ఎం.దుర్గాప్రసాద్ నాయక్ తెలిపారు. మ్యూజియం కోఆర్డినేటర్‌గా ఓ డీఈవో అధికారి ఉన్నారు. ఆయనతో పాటు మరో ముగ్గురు డీఈవోలుకూడా ఉన్నారు. వీరే ఎడ్యుకేషనల్ ఆఫీసర్లుగా వ్యవహరిస్తున్నారు

● ప్రతి సోమవారం సెలవు

ఈసైన్స్ మ్యూజియం ప్రతిరోజూ ఉదయం 9.30గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు ఉంటుంది. ప్రతి సోమవారం సెలవు.

● టికెట్ వివరాలు

పాఠశాల విద్యార్థులు ఒక్కొక్కరికి రూ.25, ప్రభుత్వ కళాశాలల విద్యార్థులకు రూ.40, ప్రైవేట్ స్కూల్ విద్యార్థులకు రూ.40, కాలేజీ విద్యార్థులకు రూ.50 చొప్పున వసూలు చేస్తున్నారు. ప్రజలకు కూడా అనుమతి ఉంది. పెద్దలకు రూ.50, పిల్లలకు ఒక్కొక్కరికి రూ.25 వంతున వసూలు చేస్తున్నారు.

● ఇలా వెళ్లాలి..



సైన్స్ సెంటర్‌కు రాజమహేంద్రవరం నుంచి మోరంపూడి హైవే మీదుగా బొమ్మూరు వద్ద రాజవోలు మార్గంలో లోపలికి వెళ్లాలి.



మంచుకొండలపై ఉండే పరిస్థితులు తెలిసేలా చేసిన ఏర్పాటు



సౌండ్‌పై అవగాహన పొందుతున్న విద్యార్థులు



కరప మండలం వాకాడలోని రామాలయం ఆవరణలో రెండు భారీ టవర్ ఆకృతులపై ఆకట్టుకుంటున్న దీపాల వరుస




దీపాలు వెలిగిస్తున్న ఎమ్మెల్యే నానాజీ, యువతులు

కనుల పండువగా.. కోటి దీపాల సంబరం!

- కరప మండలం వాకాడలో ఘనంగా నిర్వహణ
- రెండు భారీ టవర్ ఆకృతులపై దీపాలు వెలిగించిన మహిళలు

కరప, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కరప మండలం వాకాడలో సోమవారం రాత్రి కోటి దీపాల సంబరం ఘనంగా జరిగింది. రామాలయం ఆవరణలో కర్రలు, చెక్కలతో రెండు భారీ టవర్ ఆకృతులను నిర్మించారు. వాటి మధ్య అరల్లో మట్టి ప్రమిదలను ఉంచి వాటిలో నూనె పోసి తెల్లవార్లు కోటి దీపాలను వెలిగించారు. సంబరానికి విచ్చేసిన మహిళలు ఒత్తులను వెలిగించి పూజలు చేశారు. నిర్వాహకులు పలు సాంస్కృతిక ప్రదర్శనలు ఏర్పాటు చేసి సంబరాన్ని రక్తికట్టించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి వేలాదిమంది తరలివచ్చి తిలకించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కరప ఎస్ఐ తోట సునీత ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ, వేములవాడ సొసైటీ చైర్మన్ దూడల నారాయుడు, సర్పంచ్ అడబాల సత్యప్రసాద్, ఆయా పార్టీల నాయకులు, గ్రామ పెద్దలు కార్తీక దామోదరుడిని దర్శించుకుని భక్తి శ్రద్ధలతో దీపాలను వెలిగించారు.



ఆలయ ఆవరణలో సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహిస్తున్న కళాకారులు

జాతీయ స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో రంగంపేట విద్యార్థినులకు రజత పతకం

రంగంపేట, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో తూర్పుగోదావరి జిల్లా రంగంపేట జడ్పీ హైస్కూలు విద్యార్థినులు రజత పతకం సాధించారని ప్రధానోపాధ్యాయుడు వి.పార్థసారథి సోమవారం తెలిపారు. ఈ నెల 5 నుంచి 7వ తేదీ వరకు ఛత్తీస్‌గఢ్ రాజధాని రాయ్‌పూర్‌లో ఎస్‌వోఎస్‌టీసీ (ఢిల్లీ) ఆధ్వర్యంలో ఇండియన్ యంగ్ ఇన్నోవేటర్స్ అండ్ ఇన్వెన్షన్ చాలెంజ్ పేరిట నిర్వహించిన జాతీయ స్థాయి వైజ్ఞానిక ప్రాజెక్టుల ప్రదర్శన, పోటీలో దేశవ్యాప్తంగా 70 ప్రాజెక్టులను ఎంపిక చేశారు. ఇందులో రంగంపేట విద్యార్థినులు బి.పల్లవి, ఎం.జాహ్నవి రూపొందించిన బయోమెట్రిక్ మెషిన్ కూడా ఉంది. దీనికి రజత పతకం దక్కింది. విద్యార్థినులతో పాటు వారికి గైడ్‌గా వ్యవహరించిన జీవశాస్త్ర ఉపాధ్యాయిని వి.రమ్యసుధను ఎంఈవోలు కె.శ్రీనివాసరావు, పి.మధుసూదనరావు, హెచ్‌ఎం పార్థసారధి, ఉపాధ్యాయులు అభినందించారు.



విద్యార్థినులను, ఉపాధ్యాయిని రమ్యసుధను అభినందిస్తున్న హెచ్‌ఎం పార్థసారధి

జాతీయ స్థాయి స్క్వాష్ పోటీలకు 'ఆదిత్య' విద్యార్థినుల ఎంపిక

కాకినాడ రూరల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): కాకినాడ ఆదిత్య శ్రీనగర్ పాఠశాల 10వ తరగతి విద్యార్థిని నడింపల్లి రూపశ్రీ, 8వ తరగతి విద్యార్థిని పిల్లా బ్లెస్సీ షానోన్ జాతీయ స్థాయి స్క్వాష్ పోటీలకు ఎంపికైనట్టు ప్రిన్సిపాల్ టి.రమేష్ తెలిపారు. న్యూఢిల్లీలోని త్యాగరాజు మైదానంలో వచ్చే ఏడాది జనవరి 10 నుంచి 15వ తేదీ వరకు జరిగే పోటీల్లో వారు పాల్గొంటారని ఆయన చెప్పారు. ఆదిత్య విద్యా సంస్థల డైరెక్టర్ శృతిరెడ్డి మాట్లాడుతూ తమ పాఠశాల విద్యార్థినులు జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. క్రీడాకారిణిలను ఆదిత్య విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ ఎన్.శేషారెడ్డి, డైరెక్టర్ శృతిరెడ్డి, ప్రిన్సిపాల్ రమేష్, వైస్ ప్రిన్సిపాల్ విజయఉమాపతి అభినందించారు.



రూపశ్రీ, బ్లెస్సీ షానోన్




రష్యన్ హౌస్‌లో జరిగిన అవగాహన సదస్సులో మాట్లాడుతున్న తమన్నా... విద్యార్థిని అభినందించి ప్రశంసాపత్రం అందజేస్తున్న రష్యా శాస్త్రవేత్త ఓల్గా గాబ్రియేల్

జాతీయ స్థాయి సైన్స్ సెమినార్‌లో సామర్లకోట విద్యార్థిని తమన్నా

సామర్లకోట, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): న్యూఢిల్లీలో జరిగిన జాతీయ స్థాయి ఎక్స్‌ప్లోర్ సైన్స్ సెమినార్‌లో కాకినాడ జిల్లా సామర్లకోట జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల విద్యార్థిని ఎండీ తమన్నా కాటూన్ సత్తా చాటిందని సామర్లకోట ఎంఈవోలు వై.శివరామకృష్ణయ్య, పట్టపగలు పుల్లయ్య పేర్కొన్నారు. సోమవారం సాయంత్రం వారు విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 52 మంది విద్యార్థులు ఎంపిక కాగా కాకినాడ జిల్లా నుంచి తమన్నా మాత్రమే ఉందన్నారు. ఆమెకు న్యూఢిల్లీలోని రాకెట్ ఇంజనీరింగ్ కళాశాల, రష్యన్ హౌస్, రాష్ట్రపతి భవన్, నెహ్రూ ప్లానిటోరియం, నేషనల్ సైన్స్ ఎగ్జిబిషన్, నేషనల్ మ్యూజియం చూపించారు. కేంద్ర మంత్రి కె.రామ్మోహన్‌నాయుడు తమన్నాకు బహుమతి, ప్రశంసాపత్రం అందజేశారు. సోమవారం సామర్లకోట చేరుకున్న విద్యార్థిని ఎంఈవోలు, ఉపాధ్యాయులు అభినందించారు.

శంభో హరహర నమో నమో

శివశివ శంకర భక్తవశంకర శంభో హర హర నమోనమో అంటూ భక్తులు కైలాసవాసుడిని దర్శించుకుని పరవశులయ్యారు. కార్తీక మాసం మూడో సోమవారం ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని ప్రముఖ శైవ క్షేత్రాలకు భక్తులు పోటెత్తారు. తెల్లవారుజామునే ఆలయాలకు వెళ్లి క్యూలైన్లలో బారులు తీరి శివుడిని దర్శించుకుని అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు.



తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం జాంపేట ఉమారామలింగేశ్వరస్వామి ఆలయంలో శివుడే ప్రత్యక్షమైనట్టుగా స్వామికి విశేష అలంకరణ



కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం దుర్గాడలో భస్మాభిషేకం అనంతరం ప్రత్యేక అలంకరణలో రామలింగేశ్వరస్వామి



డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మురమళ్లలో వీరేశ్వరస్వామికి క్షీరాభిషేకం చేస్తున్న దృశ్యం



కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం రాచపల్లిలో అరుణాచలేశ్వరస్వామికి అన్నాభిషేకం



కాకినాడ భానుగుడిలోని అయ్యప్పస్వామి ఆలయ ప్రాంగణంలో స్ఫటిక లింగానికి అభిషేకం చేస్తున్న భక్తురాలు



కాకినాడ జిల్లా పిఠాపురం పాదగయ క్షేత్రంలో కుక్కుటేశ్వరస్వామికి అభిషేకం చేస్తున్న అర్చకులు



కాకినాడ జిల్లా సామర్లకోటలో కుమారరామ భీమేశ్వరస్వామికి అభిషేకం చేస్తున్న అర్చకులు

మరణం ముంగిట మహోపకారం!

- కాలేజీ బస్సు డ్రైవర్‌కు గుండెపోటు
- బస్సును పక్కకు ఆపి క్షణాల్లో మృతి
- 50మంది విద్యార్థులు సురక్షితం

అలమూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): కాలేజీ బస్సు డ్రైవర్‌కు ఆకస్మికంగా గుండెపోటు వచ్చింది. అయితే ఆ క్షణం తన కోసం కాకుండా విద్యార్థులను రక్షించాలనే ఆలోచనతో బస్సును పక్కకు ఆపి మరుక్షణం స్టీరింగ్‌పై వాలి డ్రైవర్ ప్రాణాలు వదిలాడు. ఈ సంఘటన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలం మడికి వద్ద జాతీయ రహదారిపై సోమవారం జరిగింది. వివరాల్లోకి వెళ్లితే.. తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరానికి చెందిన ప్రైవేట్ ఇంజనీరింగ్ కాలేజీ బస్సు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రావులపాలెం మండలం గంటి నుంచి బయలుదేరింది. రాజమహేంద్రవరానికి 50మంది విద్యార్థులను ఆలమూరు మండలం మడికి గ్రామానికి చెందిన దెందుకూరి నారాయణరాజు (60) అనే డ్రైవర్ తీసుకువెళుతున్నారు. మడికి దాటిన వెంటనే డ్రైవర్‌కు గుండెపోటు రావడంతో తక్షణం బస్సును పక్కకు ఆపి స్టీరింగ్‌పై పడిపోయాడు. దీంతో విద్యార్థులు ఒక్కసారిగా భయభ్రాంతులై బస్సు నుంచి దిగిపోయారు. వెంటనే నారాయణరాజుకు సీపీఆర్ చేసి అంబులెన్స్‌కు ఫోన్ చేయగా అప్పటికే ప్రాణాలు విడిచినట్టు స్థానికులు చెప్తున్నారు. తాను చనిపోతూ 50మంది విద్యార్థులకు చిన్నపాటి హాని జరగకుండా చేసిన డ్రైవర్ నారాయణరాజుకు విద్యార్థుల తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.



ప్రాణాలు వదిలిన డ్రైవర్ నారాయణరాజు



ఆలమూరు మండలం మడికి వద్ద జాతీయ రహదారిపై ఆపివేసిన బస్సు

క్యారేజీ తీసుకున్న 5 నిమిషాలకే..

దాదాపు 40ఏళ్లుగా డ్రైవర్ వృత్తినే నమ్ముకుని జీవిస్తున్న నారాయణరాజుకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. నారాయణరాజు ప్రతీ రోజు ఉదయమే క్యారేజీ పట్టుకుని డ్రైవింగ్‌కు వెళ్తాడు. సోమవారం ఉదయం అతడు బయలు దేరే సమయానికి వంట పూర్తి కాకపోవడంతో తాను రోడ్డుమీదకు తీసుకొచ్చి క్యారేజీ అందిస్తానని భార్య చెప్పడంతో నారాయణరాజు వెళ్లిపోయ్యాడు. గంటి బయలుదేరి వచ్చి మడికి వద్ద భార్య చేతులమీదుగా క్యారేజీ తీసుకున్న ఐదు నిమిషాల వ్యవధిలోనే గుండెపోటు వచ్చిన భర్త చనిపోవడంతో భార్య బేబి బోరున విలపిస్తుంది.

రద్దీగా రత్నగిరి...

» కార్తీక సోమవారం 8645 వ్రతాలు » రూ.80 లక్షల ఆదాయం

అన్నవరం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుడి సన్నిధి కార్తీక సోమవారం పర్వదినం పురస్కరించుకుని భక్తజనంతో నిండిపోయింది. రద్దీ నేపథ్యంలో ఒంటిగంట నుంచి వ్రతాలు, 2గంటల నుంచి సర్వదర్శనాలు ప్రారంభమయ్యాయి. సోమవారం ఒక్కరోజు 8645 జంటలు వ్రతాలు ఆచరించుకోగా వివిధ విభాగాల ద్వారా సుమారు రూ.85 లక్షల ఆదాయం ఆలయానికి లభించింది. భక్తులకు అసౌకర్యం కలగకుండా ఈవో సుబ్బారావు, చైర్మన్ రోహిత్ వేర్వేరు ప్రదేశాల్లో ఉండి పర్యవేక్షణ చేస్తూ ఏర్పాట్లు చేశారు. దర్శనం అనంతరం మహిళా భక్తులు రావిచెట్టు వద్ద కార్తీకదీపాలు వెలిగించారు. సత్యదేవ నిత్యాన్నదాన పథకం ద్వారా 30 వేలమందికి నిరంతరాయంగా ఉచిత పులిహోర పంపిణీ చేశారు.



వ్రతాలు ఆచరిస్తున్న భక్తులు



పీఠాధిపతికి వేదాశీర్వచనం అందిస్తున్న పండితులు

పెనుగొండ క్షేత్ర పీఠాధిపతి పూజలు

సత్యదేవుడి సన్నిధిలో పెనుగొండ క్షేత్ర పీఠాధిపతి శ్రీ ప్రజానంద సరస్వతి బాలాజీ స్వామిని దర్శించి ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఆయనకు ఈవో వీర్ల సుబ్బారావు ఆలయ మర్యాదలతో ఘనస్వాగతం పలికారు. దర్శనానంతరం వేద పండితులు వేదాశీర్వచనాలు అందజేశారు.

రూ.లక్ష విరాళం

సత్యదేవ నిత్యాన్నదాన పథకానికి వీరంపాలెనికి చెందిన బొల్లారెడ్డి రామకృష్ణారెడ్డి రూ.లక్ష విరాళాన్ని ఈవో వీర్ల సుబ్బారావుకు అందజేశారు. దాతను ఆయన అభినందించి వారికి ప్రసాదం, ప్రత్యేక దర్శన సౌకర్యాలు కల్పించారు.



కాలేజీ నుంచి ఇంటికెళ్తుండగా...

బస్సు ఢీకొని విద్యార్థి మృతి

కాకినాడ క్రైం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఓ కళాశాల బస్సు ఢీకొని అదే కళాశాలకు చెందిన విద్యార్థి దుర్మరణం చెందిన సంఘటన సోమవారం కాకినాడలో జరిగింది. వివరాలిలా ఉన్నాయి. కాకినాడ దుమ్ములపేటకు చెందిన కంబాల యువన్ శంకర్ (17) స్థానిక పోస్టల్‌కాలనీలో ఉన్న శ్రీచైతన్య క్యాంపస్‌లో ఇంటర్మీడియట్ ఎంపీసీ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. అతడి తండ్రి మల్లేశ్వరరావు చేపల వేట చేస్తూ జీవనం సాగిస్తుంటాడు. అయితే శంకర్ సోమవారం సాయంత్రం కళాశాల ముగిశాక 5.50 గంటలకు తన స్కూటీపై స్నేహితుడైన మోజస్‌ను ఎక్కించుకుని ఇంటికి వెళ్తున్న క్రమంలో సాంబమూర్తినగర్ 5వ వీధి ఆదిత్య ఉమెన్స్ డిగ్రీ కళాశాల సమీపంలోకి వచ్చేసరికి స్కూటీ అదుపు తప్పడంతో మోజస్ ఎడమపక్కకు పడిపోగా, శంకర్ కుడి పక్కకు పడిపోయాడు. అదే సమయంలో వెనుక నుంచి వస్తున్న కళాశాల బస్సు టైర్ శంకర్ ఛాతీపైకి ఎక్కడంతో తీవ్రగాయాల పాలయ్యాడు. వెంటనే మోజస్ స్థానికుల సహాయంతో జీజీహెచ్‌కు తరలించగా అప్పటికే మృతిచెందినట్టు జీజీహెచ్ అత్యవసర విభాగ వైద్యులు తెలిపారు. కాకినాడ త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



శంకర్ (ఫైల్)

పిచ్చికుక్క ఎంత పనిచేసింది!

దాడిలో మూడేళ్ల బాలుడికి గాయాలు

చికిత్స పొందుతూ మృతి

గొల్లప్రోలు రూరల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): బయట ఆడుకుంటున్న మూడేళ్ల చిన్నారిపై పిచ్చి కుక్క దాడి చేసి విచక్షణారహితంగా గాయపరిచింది. చికిత్స చేయించారు. మళ్లీ అకస్మాత్తుగా అస్వస్థతకు గురికావడంతో కాకినాడ ప్రభుత్వాసుపత్రిలో చేర్చగా సోమవారం మరణించాడు. కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం కొడవలి గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు, మాజీ సర్పంచ్ కొలిపే బుల్లబ్బాయి మనుమడు, నాగేశ్వరరావు రత్నశ్రీ దంపతుల ఏకైక కుమారుడు అయిన భరత్(3) అక్టోబరు 16న ఇంటి బయట ఆడుకుంటున్నాడు. ఆ సమయం లో పిచ్చికుక్క దాడి చేసి విచక్షణారహితంగా కరిచింది. ఈ దాడిలో గాయపడ్డ భరత్‌ను ప్రత్తిపాడు ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లి ఏఆర్‌వీ ఇంజక్షన్లతో పాటు చికిత్స చేయించారు. కోలుకుంటున్న తరుణంలో ఆదివారం మళ్లీ అస్వస్థతకు గురికాగా కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తీసుకువెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం తెల్లవారుజామున మరణించాడు. తమ ఏకైక కుమారుడు పిచ్చికుక్క దాడిలో గాయపడి మరణించడంతో నాగేశ్వరరావు, రత్నశ్రీ దంపతులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. ముక్కుపచ్చలారని బాబు మరణించడాన్ని వారితో పాటు గ్రామస్తులు జీర్ణించుకోలేకపోతున్నారు.



భరత్ (ఫైల్)

నివారణ చర్యలు ఏవి..?

గ్రామంలో కొంతకాలంగా పిచ్చికుక్కల బెడద అధికంగా ఉంది. బాలుడిని కరిచి గాయపరిచిన కుక్క 2రోజుల వ్యవధిలో పలువురిని గాయపరిచింది. వీరంతా పెద్దవారు కావడంతో చికిత్స పొంది కోలుకున్నారు. ఆ పిచ్చికుక్కను గ్రామస్తులు కొట్టి చంపివేశారు. అయితే 2 కొద్దిరోజులుగా కుక్కలు పలువురిని గాయపరుస్తున్నాయి. వీటిని నియంత్రణకు పంచాయతీ అధికారులు చర్యలు తీసుకోకపోవడంపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కుక్కలను నియంత్రించి ఉంటే బాలుడు బతికి ఉండేవాడని పేర్కొంటున్నారు.

ప్రతీ రైతుకు అండగా ప్రభుత్వం

శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు



అనపర్తి మండలం కుతుకులూరులో ప్రసంగిస్తున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు

అనపర్తి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని రాష్ట్ర శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు అన్నారు. సోమవారం తూర్పుగోదావరి జిల్లా అనపర్తి మండలం కుతుకులూరు సొసైటీ వద్ద ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డితో కలిసి ప్రారంభించారు. యంత్రం ద్వారా తేమ కొలిచే విధానాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో స్పీకర్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 3217 ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా 50లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలన్నది ప్రభుత్వ లక్ష్యం కాగా ఇప్పటికే 1612 ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా 46మండలాల్లో 20137 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయడం జరిగిందన్నారు. ప్రతీ రైతుకు ప్రభుత్వం అండగా ఉంటుందని తెలిపారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మొంథా తుఫాన్ వల్ల నష్టపోయిన ప్రతీ రైతును ప్రభుత్వం ఆదుకుంటుందని, పంట నష్టం అంచనా వేసేందుకు కేంద్ర బృందాలు పర్యటించనున్నాయని నివేదిక అందిన వెంటనే కేంద్రం సహాయంతో రాష్ట్ర ప్రభుత్వం రైతులకు నష్టపరిహారం ప్రకటిస్తుందన్నారు. టీడీపీ ఇన్‌చార్జి నల్లమిల్లి మనోజ్‌రెడ్డి, ఏఎంసీ చైర్‌పర్సన్ జుత్తుగ సూర్యకుమారి, ఆళ్ళ గోవిందు, కర్రి శేషారత్నం, కర్రి సత్యగౌరి, బేరా వేణమ్మ, సొసైటీ చైర్మన్లు నల్లమిల్లి సుబ్బారెడ్డి, దత్తుడు శ్రీను, కరకుదురు దత్తుడు పాల్గొన్నారు.

మొక్కు తీర్చుకుని వచ్చేలోపు చీరతో ఉరేసుకుని..

కాకినాడలో యువకుడి ఆత్మహత్య

కాకినాడ క్రైం, నవంబరు 10 (ఆంధ్ర జ్యోతి): వ్యక్తిగత కారణాలతో తీవ్ర మనస్తాపానికి గురైన ఓ యువకుడు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన సోమవారం కాకినాడలో జరిగింది. వివరాల్లోకి వెళితే.. కాకి నాడ జగన్నాధపురం నర్సింహ రోడ్డు పూర్వం వారి వీధికి చెందిన దండుప్రోలు రాజు (21) రెండేళ్ల వయస్సులోనే తల్లిదండ్రులను కోల్పోయాడు. అప్పటి నుంచి నానమ్మ శుభ వద్దనే పెరిగాడు. ప్రస్తుతం డెలివరీ బాయ్‌గా పని చేస్తున్నాడు. రాజు గత మూడేళ్లుగా తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరానికి చెం దిన ఓ యువతిని ప్రేమించాడు. ఇటీవల వారిద్దరి మధ్య తరచూ గొడవలు జరుగుతుండడంతో మనస్తాపానికి గురై 10 రోజుల క్రితం ఎలుకల మందు తాగాడు. అయితే కుటుంబీకులు సకాలంలో ఆసుపత్రిలో చేర్చడంతో ప్రాణాపాయం తప్పింది. రాజు బాగుంటే కోటిపల్లి శివాలయానికి వస్తామని నానమ్మ, మేనత్త మొక్కుకున్నారు. సోమవారం రాజును ఇంటిలో ఉంచి మొక్కు తీర్చుకునేందుకు వెళ్లారు. మొక్కు తీర్చుకుని సాయంత్రం వచ్చి చూసేసరికి రాజు ఇంటి దూలానికి చీరతో ఉరేసుకుని విగతజీవిగా కనిపించాడు. వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



రాజు (ఫైల్)

జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కారమవ్వాలి

పీడీజే గంధం సునీత

రాజమహేంద్రవరం, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): జాతీయ లోక్ అదాలత్‌లో రాజీకి యోగ్యమైన కేసులు పెద్ద సంఖ్యలో పరిష్కారం కావాలని ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్‌పర్సన్ గంధం సునీత ఆదేశించారు. డిసెంబరు 13న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌ని పురస్కరించుకుని న్యాయమూర్తులతో సోమవారం ఆమె సమావేశమయ్యారు. కేసుల పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై దిశా నిర్దేశం చేశారు. పెండింగ్‌లో ఉన్న కేసుల జాబితాను డీఎల్ఎస్ఏకి అందజేయాలని సూచించారు. అనంతరం ఉమ్మడి జిల్లా ఎక్సైజ్ అధికారులతో సమావేశం నిర్వహించి తగు ఆదేశాలిచ్చారు. డీఎల్ఎస్ఏ కార్యదర్శి ఎన్.శ్రీలక్ష్మి, నాలుగు జిల్లాల ఎక్సైజ్ అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో అధికారులకు సూచనలు ఇస్తున్న పీడీజే గంధం సునీత

కందరాడలో భారీ వృక్షానికి మంటలు

భయాందోళనకు గురైన ప్రజలు

పిఠాపురం రూరల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురం మండలం కందరాడ గ్రామంలో భారీ వృక్షానికి అకస్మాత్తుగా మంటలు అంటుకున్నాయి. దీంతో ఆ మార్గంలో వెళ్లే ప్రజలు, వాహనదారులు భయాందోళనకు గురయ్యారు. గ్రామంలోని ఎస్సీ కాలనీ సమీపంలో గల ప్రైవేటు పాఠశాల ఎదురుగా ఉన్న భారీ వృక్షం మీదుగా కరెంటు తీగలు వెళ్తున్నాయి. అవి షార్ట్‌సర్క్యూట్ అవ్వడంతో మంటలు చెలరేగాయి. దీంతో పిఠాపురం-సామర్లకోట ఆర్‌అండ్‌బీ రహదారిపై వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న పిఠాపురం రూరల్ ఎస్ఐ జానీబాషా అక్కడకు చేరుకుని విద్యుత్ సరఫరాను నిలిపివేయించారు. వాహనాలను ఎస్సీ కాలనీలోని రహదారుల మీదుగా మళ్లించారు. అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపులోకి తెచ్చారు.



కందరాడలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో భారీ వృక్షానికి అంటుకున్న మంటలు

షేక్ సుభానీకి రాష్ట్ర ఉత్తమ ఉర్దూ ఉపాధ్యాయ అవార్డు

మామిడికుదురు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఉత్తమ ఉర్దూ ఉపాధ్యాయుడిగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మామిడికుదురు జడ్పీ ఉన్నత పాఠశాల స్కూల్ అసిస్టెంట్ షేక్ సుభానీ ఎంపికయ్యారు. మౌలానా అబుల్‌కలాం అజాద్ జయంతిని పురస్కరించుకుని ఈ అవార్డుకు సుభానీని రాష్ట్ర ఉర్దూ అకాడమీ ఎంపిక చేసింది. మంగళవారం అబుల్‌కలాం అజాద్ జయంతిని పురస్కరించుకుని విజయవాడలో జరిగే కార్యక్రమంలో అవార్డును అందిస్తారని ప్రధానోపాధ్యాయుడు బి.చిరంజీవిరావు తెలిపారు. సుభానీని ఇతర ఉపాధ్యాయులు, స్థానికులు అభినందించారు.



షేక్ సుభానీ

సోమవరం కారు ప్రమాద ఘటనలో నాలుగుకు చేరిన మృతుల సంఖ్య

మరో వ్యక్తి పరిస్థితి విషమం

కిర్లంపూడి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కిర్లంపూడి మండలం సోమవరం గ్రామం వద్ద జాతీయ రహదారిపై ఈనెల 8న పెళ్లికారు ఢీకొన్న సంఘటనలో ముగ్గురు అక్కడికక్కడే మృతిచెందారు. ముగ్గురు గాయపడ్డారు. గాయపడ్డ ముగ్గురిని కాకినాడ ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతున్నారు. అందులో జగ్గంపేట మండలం ఇర్రిపాక గ్రామానికి చెందిన విద్యార్థి కూండ్రపు దుర్గచైతన్య చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందినట్టు కిర్లంపూడి పోలీసులు తెలిపారు. దీంతో ఈ ప్రమాదంలో మృతుల సంఖ్య నాలుగుకు పెరిగింది. అలాగే మరో వ్యక్తి భద్రం పరిస్థితి విషమంగా ఉందని పోలీసులు తెలిపారు.

అమలాపురంలో బాలిక కిడ్నాప్

కాకినాడ తీసుకెళ్లినట్టు గుర్తింపు

అమలాపురం, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): అమలాపురంలో ఐమెండ్ స్కూల్‌లో ఐదోతరగతి చదువుతున్న పదేళ్ల బాలిక సోమవారం సాయంత్రం కిడ్నాప్‌కు గురైన విషయం సంచలనంగా మారింది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలోని మెయిన్‌రోడ్డులో ఉన్న ఓ ప్రైవేటు స్కూలులో వైసీపీ నాయకుడు కముజు రమణ కుమార్తె నిషిత (10) కిడ్నాప్ అయినట్టు పట్టణ పోలీసులకు సమాచారం అందింది. బాలికకు వరుసకు మేనమామ అయ్యే మట్టపర్తి మధు అనే వ్యక్తి సోమవారం సాయంత్రం స్కూలు వద్దకు వచ్చి బాలికను ఇంటికి తీసుకెళ్తానని చెప్పి మోటారుసైకిల్ ఎక్కించుకుని వెళ్లినట్టు స్థానికులు తెలిపారు. తన కుమార్తె ఇంకా ఇంటికి చేరలేదని విచారించగా మట్టపర్తి మధు స్కూలుకు వెళ్లి తీసుకెళ్లినట్టు తెలిసిందని కముజు రమణ పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సీఐ వీరబాబు అప్రమత్తమై విచారణ చేపట్టారు. కముజు రమణకు ఇద్దరు కుమార్తెల్లో చిన్న కుమార్తె నిషితను సమీప బంధువుగా పేర్కొంటున్న మట్టపర్తి మధు మోటార్‌సైకిల్ ఎక్కించుకుని కాకినాడ వెళ్లినట్టు ప్రాథమికంగా పోలీసులు గుర్తించారు. కాకినాడలోని మొబైల్ షాపులో కొత్త ఫోన్, సిమ్ కొనుగోలు చేస్తున్న సమయంలో బాలిక ఎడవడంతో మధు ఫోన్‌తో పాటు సిమ్‌కార్డును వదిలి బాలికను తీసుకుని పరారైనట్టు పోలీసులకు ప్రాథమికంగా సమాచారం అందింది. దీంతో కాకినాడ, అమలాపురం నుంచి పోలీసు బృందాలు బాలిక ఆచూకీ కోసం ముమ్మరంగా గాలింపు చేపట్టాయి.

సెంట్రల్ జైలులో ఇద్దరు జీవిత ఖైదీలకు క్షమాభిక్ష

ఆమోదం తెలిపిన క్యాబినెట్

రాజమహేంద్రవరం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అర్హులైన జీవిత ఖైదీలకు క్షమాభిక్ష ప్రసాదించింది. సోమవారం జరిగిన మంత్రి మండలి సమావేశంలో 27వ అంశంగా హోంశాఖలోని జైళ్లశాఖ చెందిన అంశాన్ని ప్రవేశపెట్టారు. దీనిలో ముగ్గురు జీవిత ఖైదీలకు క్షమాభిక్ష కల్పించాల్సి ఉంది. దీనికి జీవో ఎంఎస్ నెం.71 నిర్దేశించిన ప్రకారం మంత్రి మండలి ఆమోదం తెలిపింది. దీనిలో భాగంగా తూర్పుగోదావరి జిల్లా రాజమండ్రి సెంట్రల్‌లో జీవిత ఖైదు అనుభవిస్తున్న మధిరి సువర్ణరాజు, కటికిరెడ్డి నాగేశ్వరరావు విడుదల కానున్నారు. తూర్పుగోదావరి జిల్లా బిక్కవోలు మండలం కొమరిపాలేనికి చెందిన నాగేశ్వరరావు ఓ రైస్ మిల్లులో పని చేస్తుండేవాడు. కలెక్షన్ ఏజెంట్‌ను హత్య చేసి సొమ్ము దోపిడీ చేశారనే నేరంపై రాజమండ్రిలోని కోర్టు జీవిత ఖైదు విధించగా 2011 మార్చి 21న జైలుకు వచ్చాడు. ఇతడు ఇప్పటి వరకూ పర్లో, పెరోల్‌పై బయటకు కూడా వెళ్లలేదు. అలాగే కృష్ణా జిల్లా గుడ్లవల్లేరు మండలం చంద్రాల గ్రామానికి చెందిన మదిరి సువర్ణరాజు భార్యను హత్య చేసిన కేసులో 2010 జూలై 15 నుంచి జైలులో శిక్ష అనుభవిస్తున్నాడు. ఇతడి ప్రవర్తన ఆధారంగా సెమీ ఓపెన్ ఎయిర్ జైలు అర్హత పొందాడు. అయితే ప్రభుత్వం జీవో 2రోజుల్లో ఇచ్చే అవకాశం ఉంది. ఆ జీవో ఆధారంగా వీళ్లిద్దరూ స్వేచ్ఛా వాయువులు పీల్చుకొని కుటుంబాల చెంతకు చేరనున్నారు.

హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు

గోకవరం, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదుతో పాటు రూ.15,000 జరిమానా విధిస్తూ రాజమహేంద్రవరం 9వ అదనపు జిల్లా కోర్టు జడ్జి తీర్పు వెలువరించినట్టు ఎస్ఐ పి.పవన్‌కుమార్ తెలిపారు. గోకవరం మండలం బావాజీపేటకి చెందిన విరోతి శ్రీను భార్యతో అదే గ్రామానికి చెందిన బలిజ శ్రీను వివాహేతర సంబంధం ఏర్పరచుకున్నాడు. ఈ క్రమంలో విరోతి శ్రీను అడ్డును తొలగించుకోవాలనే ఉద్దేశంతో 2020 డిసెంబరు 30న తెల్లవారుజామున 5.30 గంటలకు పొలం పనుల నిమిత్తం బలిజ శ్రీను విరోతి శ్రీనును రంపయర్రంపాలెం తోటలోకి తీసు కెళ్లాడు. అక్కడ బండ రాయితో శ్రీనును తల పై కొట్టి హత్య చేశాడు. ఈ సంఘటనపై మృతుడి సోదరుడు విరోతి అప్పారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అప్పట్లో ఎస్ఐగా పని చేసిన పి.చెన్నారావు కేసు నమోదు చేయగా అప్పటి కోరుకొండ సీఐ పి.ఈ.పవన్‌కుమార్‌రెడ్డి నిందితుడిని అరెస్ట్ చేసి కేసు దర్యాప్తు అనంతరం కోర్టులో చార్జ్‌సీటు దాఖలు చేశారు. తదనంతరం నేరం రుజువు కావడంతో బలిజ శ్రీనుకు జీవిత ఖైదు, రూ.15,000 జరిమానా విధిస్తూ రాజమహేంద్రవరం 9వ అదనపు జిల్లా కోర్టు జడ్జి ఎం.మాధురి తీర్పు ఇచ్చినట్టు ఎస్ఐ పవన్‌కుమార్ తెలిపారు.

పుస్తెలతాడు చోరీ

కాట్రేనికోన, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా కాట్రేనికోన మండలం కుండలేశ్వరస్వామి దర్శనానికి వచ్చిన మహిళ మెడలోని 7 కాసుల బంగారు పుస్తెలతాడును బైక్‌పై వచ్చిన దుండగుడు లాక్కెళ్లాడు. నల్లజర్ల మండలం చోడవరం నుంచి ఆర్యవైశ్య సంఘం తరపున నలభై మంది బస్సులో వచ్చారు. పుష్కరఘాట్ వైపు నడుచుకుంటూ వెళ్తుండగా బైక్‌పై వచ్చిన ఆగంతకుడు గుళ్ళపూడి రత్నకుమారి మెడలోని బంగారు పుస్తెలతాడును లాక్కుని పరారయ్యాడు. పోలీసులు వచ్చి వివరాలు సేకరించారు.

రాజమహేంద్రవరం
• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి
ఆంధ్రజ్యోతి www.andhrajyothy.com

14 నుంచి జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు

బిక్కవోలు, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): గ్రంథాలయ పితామహుడు అయ్యంకి వెంకటరమణయ్య స్వగ్రామమైన కొంకుదురు శాఖా గ్రంథాలయంలో ఈ నెల 14 నుంచి 20 వరకూ 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించనున్నట్టు గ్రంథాలయాధికారి ఎన్.బాల సోమవారం తెలిపారు.14న గ్రంథాలయ వారోత్సవాల ప్రారంభం, బాలల దినోత్సవం,15న పుస్తక ప్రదర్శన, 16న గ్రంథాలయ ఉద్యమంలో ప్రముఖుల ప్రసంగాలు, 17న రచయితల సందేశాలు, సెమినార్లు, కవి సమ్మేళనాలు, 18న విద్యార్థులకు గ్రంథాలయాల నిర్వహణ, ఉపయోగాలపై వక్తృత్వం, డ్రాయింగ్, వ్యాసరచన, క్విజ్, క్రీడా పోటీలు, 19న మహిళా దినోత్సవం, 20న వారోత్సవాల ముగింపు, పోటీల్లోని విజేతలకు బహుమతుల ప్రదానం చేయనున్నట్టు పేర్కొన్నారు.

నన్నయ వర్శిటీ అభివృద్ధికి కృషి

రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యుడు వెంకటప్ప


వీసీ ప్రసన్నశ్రీని సన్మానిస్తున్న వెంకటప్ప

దివాన్‌చెరువు, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం అభివృద్ధికి పూర్తి సహాయసహకారాలు అందిస్తామని రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యుడు పి.వెంకటప్ప అన్నారు. సోమవారం నన్నయ వర్శిటీకి వచ్చి వీసీ ప్రసన్నశ్రీని మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా గిరిజన భాషాభివృద్ధికి ఆమె చేస్తున్న కృషిని ప్రశంసించి సన్మానించారు. త్వరలో వర్శిటీలో గిరిజనాభివృద్ధి, భాష సాంస్కృతికి సంబంధించిర పలు కార్యక్రమాలు చేపడతామన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పి.విజయనిర్మల, టీఎస్ఎఫ్ జాతీయ అధ్యక్షుడు అక్కులప్పనాయక్, రాష్ట్రాధ్యక్షుడు రాగిరి చంద్రప్ప, ఉపాధ్యక్షుడు రవీంద్ర నాయక్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మూడవత్ విష్ణునాయక్, బీజేపీ గిరిజన మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటేశ్వర్లు నాయక్ పాల్గొన్నారు.

ఎంఆర్ పాలెంలో ఖరీఫ్ ధాన్యం కొనుగోలు

కడియం, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం రైతు పక్షపాతి అని, ధాన్యం విక్రయించిన రెండు రోజుల్లో రైతుల బ్యాంకు ఖాతాలకు సొమ్ములు జమ చేస్తోందని ఎంఆర్‌పాలెం సర్పంచ్ అన్నందేవుల చంటి తెలిపారు. ఖరీఫ్-2025కు సంబంధించి ధాన్యం కొనుగోలును సోమవారం ఆయన ప్రారంభించారు. ధాన్యం కొనుగోలును రైతులు సద్వినియోగం చేసుకోవడం ద్వారా వారు సకాలంలో సొమ్ములు పొందవచ్చన్నారు. ఏవో వీవీ శ్రీనివాస్ మాట్లాడుతూ రైతులు తమకు నచ్చిన రైసుమిల్లులకు ధాన్యం పంపవచ్చన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు, రైతులు, వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

నేత్ర వైద్య శిబిరం

గ్రామంలో సర్పంచ్ చంటి అధ్య క్షతన ఇంటర్నేషనల్ పేపరుమిల్లు సహకారంతో నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. వేమగిరి పరమహంస నేత్రాలయ సహకారంతో ఏర్పాటు చేసిన ఈ శిబిరాన్ని పేపరుమిల్లు ఈడీ ముఖేష్ జైన్ ముఖ్యఅతిథిగా విచ్చేసి సర్పంచ్ చంటి తో కలిసి ప్రారంభించారు. ముందుగా ఈడీ గ్రామంలోని శివాలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా చంటి మాట్లాడుతూ పేపరుమిల్లు తమ గ్రామ పరిధిలో ఉన్నప్పటికీ సీఎస్ఆర్ నిధుల కేటాయింపు, గ్రామాభివృద్ధికి తగిన గుర్తింపు ఇవ్వడం లేదని, యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని ఈడీ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో గ్రామాభివృద్ధికి ప్రాధాన్యమిస్తామని హామీ ఈడీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీటీసీ గొల్లపల్లి శ్రీను, అన్నందేవుల రాజీవ్‌కృష్ణ, పేపరుమిల్లు సెక్రటరీ బి.జైకుమార్ శంకు, దాసరి తాతారావు, పరమహంస నేత్రాలయ ఏవో చలం పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే వాసు శంకుస్థాపన


శిలాఫలకం ఆవిష్కరించిన ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు

రాజమహేంద్రవరం సిటీ, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): స్థానిక 9వ డివిజన్‌లో మహాలక్ష్మమ్మ ఆలయం రోడ్డులో రూ.14 లక్షల వ్యయంతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులకు ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు, ఎమ్మెల్సీ సోము వీర్రాజుతో కలిసి సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి అధికారంలోకి వచ్చాక ఈ డివిజన్‌లోనే రూ.12 కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయగా ఇంకా రూ.36 కోట్లతో పనులు చేపట్టాల్సివుందన్నారు. ఎమ్మెల్సీ సోము వీర్రాజు మాట్లాడుతూ కూటమి అధికారంలోకి వచ్చాకే అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు. నగరం శరవేగంగా అభివృద్ధి చెందుతుందన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, స్థానిక పెద్దలు పాల్గొన్నారు.

నేటి నుంచి రాష్ట్ర స్థాయి ఫెన్సింగ్ పోటీలు

రాజానగరం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : రాజానగరం సమీపంలోని జీఎస్ఎల్ మెడికల్ కళాశాలలో ఈ నెల 11నుంచి 12వ రాష్ట్రస్థాయి సీనియర్ల ఫెన్సింగ్ (కత్తిసాము)పోటీలు నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు ఎన్.సతీష్ తెలిపారు. సోమవారం వారు మాట్లాడుతూ కళాశాలలోని శుశృత ఆడిటోరియంలో ఉదయం 8గంటలకు ప్రారంభమయ్యే ఈ పోటీలకు రాష్ట్రంలోని 13 జిల్లాల నుంచి దాదాపు 250 మంది అమ్మాయిలు, అబ్బాయిలు పాల్గొంటారన్నారు. ఈ పోటీల్లో తమ సత్తాచాటుకునేందుకు ఇప్పటికే కళాశాలకు చేరుకున్నట్టు తెలిపారు.

మూవబుల్ డివైడర్ల తొలగింపు





ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

రాజమహేంద్రవరం సిటీ, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంలో ఈట్‌స్ట్రీట్- వై-జంక్షన్ రోడ్డుకు అధికారులు క్లియరెన్స్ ఇచ్చారు. ఈట్‌స్ట్రీట్-వై-జంక్షన్ రోడ్డుకు కనెక్టివిటీ రోడ్డుగా ఉన్న జంక్షన్‌ను మూవ్‌బుల్ డివైడర్లతో మూసివేయడంతో వాహనదారులు రాంగ్ రూట్‌లో వెళ్లి ప్రమాదాల బారిన పడుతున్నారని ఆంధ్రజ్యోతి దినపత్రికలో కుడి ఎడమైతే ప్రమాదమేనోయ్! శీర్షికతో సోమవారం ప్రచురించిన కథనానికి ట్రాఫిక్ పోలీసులు స్పందించారు. ఉదయం ఈట్‌స్ట్రీట్-వై-జంక్షన్ రోడ్డు క్రాసింగ్ వద్ద పెట్టిన మూవ్‌బుల్ డివైడర్లను తొలగించి రోడ్డుకు క్లియరెన్స్ ఇచ్చారు. దీంతో వాహనదారులు ఆనందం వ్యక్తం చేశారు.

రాష్ట్ర లేబర్ వెల్ఫేర్ బోర్డు డైరెక్టరుగా నీలపాల



రాజానగరం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర లేబర్ వెల్ఫేర్ బోర్డు డైరెక్టరుగా రాజానగరానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు నీలపాల అరవరాజు నియమితులయ్యారు. ప్రభుత్వం సోమవారం ప్రకటించిన పది కార్పొరేషన్లలో రాష్ట్ర లేబర్ వెల్ఫేర్ బోర్డుకు కూడా డైరెక్టర్లను నియమించింది. వీరిలో రాజానగరం నియోజకవర్గం నుంచి మాజీ సర్పంచ్ అరవరాజుకు చోటు లభించింది. ఈయన 25 ఏళ్లు టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. సుదీర్ఘకాలంగా చురుకైన పాత్ర పోషిస్తూ పార్టీ అభివృద్ధికి ఎనలేని కృషి చేశారు. తన నియామకం పట్ల సీఎం చంద్రబాబు, డీసీఎం పవన్‌కళ్యాణ్, మంత్రి లోకేశ్, రుడా ఛైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి, ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణలకు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

కోరుకొండ, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలువురికి వైద్యం అనంతరం మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను జనసేన పార్టీ నా సేన కోసం నా వంతు రాష్ట్ర కమిటీ కోఆర్డినేటర్ బత్తుల వెంకటలక్ష్మి వారి ఇళ్లకు వెళ్లి అందజేశారు. మునగాల గ్రామానికి చెందిన కడియం రామసత్యవాణికి రూ.21,974, నాగులపల్లి తేజకి రూ.18,732, నాగులపల్లి కార్తీక్‌కు రూ.19,850, వణం నాగమణికి రూ.30,000, కోటి గ్రామానికి చెందిన గట్టి ఉదయ్‌శంకర్‌కుమార్‌కు రూ.30 వేలు, గరగలంపాలేనికి చెందిన యార్లగడ్డ భూషణానికి రూ.40 వేలు,రాయుడు వెంకటరామారావుకు రూ.20 వేలు, శ్రీరంగపటానికి చెందిన అద్దరి సీతారామకృష్ణకు రూ.48,907, పల్లా రాము కాంతానికి రూ.67,039, సాదే ఆశారత్నానికి రూ.40541 విలువైన చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో పలువురు కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

శ్రీసత్యసాయిబాబా శతవర్ష జయంతి ఉత్సవాలు

రంగంపేట, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): భగవాన్ శ్రీసత్యసాయిబాబా శతవర్ష జయంతి ఉత్సవాల కార్యక్రమంలో భాగంగా సోమవారం శ్రీసత్యసాయి ప్రపంచవ్యాప్త అఖండ భజన (24గంటలు) కార్యక్రమాలు మండలంలోని ఈలకొలను, కోటపాడు, రంగంపేట శ్రీసత్యసాయి మందిరాల్లో ఘనంగా జరిగాయి.ఈ సందర్భంగా రంగంపేట సత్యసాయి సమాజ సేవా కేంద్రంలో స్థానిక శ్రీసత్య ప్రసాద్ రైస్‌మిల్ అధినేత కుచ్చర్లపాటి శివరామరాజు సోదరి రుద్రరాజుహేమ సుభద్ర బాబా చిత్రపటానికి, పాదుకలకు అష్టోత్తర పూజలు, జ్యోతిప్రజ్వలన చేసి అఖండ భజన ప్రారంభించారు. చండ్రేడు, పెదరాయవరం, రంగంపేట, పాలచర్ల గ్రామాలకు చెందిన భజన మండలి సభ్యులు 24 గంటలు భజనలు చేశారు.

క్రీడల్లో మహిళలు పెరగడం శుభపరిణామం

» నన్నయ వీసీ ప్రసన్నశ్రీ
» ఇంటర్ కాలేజియేట్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ కమ్ టీమ్ సెలక్షన్


అథ్లెటిక్స్ సెలక్షన్ ట్రయల్స్ ప్రారంభిస్తున్న వీసీ ప్రసన్నశ్రీ తదితరులు

రాజమహేంద్రవరం అర్బన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): గతంతో పోల్చితే ప్రస్తుత రోజుల్లో మహిళలు క్రీడల్లో అధిక సంఖ్యలో పాల్గొనడం శుభపరిణామమని వీసీ ఎస్.ప్రసన్నశ్రీ అన్నారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఇంటర్ కాలేజియేట్ అథ్లెటిక్స్ (పురుషులు, మహిళలు) ఛాంపియన్‌షిప్ కమ్ యూనివర్శిటీ టీమ్ సెలక్షన్ ట్రయల్స్ 2025-26 సోమవారం రాజమహేంద్రవరంలోని ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల గ్రౌండ్సులో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రసన్నశ్రీ ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడుతూ జీవితంలో గెలుపు, ఓటమి సాధారణమైనవని, విద్యార్థులు తిరుగులేని విజయాలతో ముందుకు సాగేందుకు ఆత్మవిశ్వాసం చాలా అవసరమని అన్నారు. ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ రామచంద్ర ఆర్కే మాట్లాడుతూ విశ్వవిద్యాలయ స్థాయి పోటీలకు ఆతిథ్యమివ్వడం కళాశాల ప్రతిష్ఠను పెంచుతుందన్నారు. వెటరన్ క్రీడాకారుడు రాజ్‌కుమార్ బాబు, కామాక్షి గ్రూప్ ఎండీ త్రిమూర్తులు, ఆర్ట్స్ కళాశాల అలుమ్ని అసోసియేషన్ అధ్యక్షుడు ముళ్ల మాధవరావు, నన్నయ విశ్వవిద్యాలయం స్పోర్ట్సు బోర్డు అసిస్టెంట్ సెక్రటరీ ఎంవీఎస్ఎస్ఎన్ మూర్తి తదితరులు పాల్గొన్నారు. వివిధ కళాశాలల నుంచి వచ్చిన అథ్లెట్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సన్మానం

దేవరపల్లి, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): యర్నగూడెం జీజేసీలో చదువుతున్న విద్యార్థినులు పలు క్రీడల్లో ప్రతిభ సాధించడంతో సోమవారం ప్రిన్సిపాల్ ఛత్రపతి శివాజీ వారిని సన్మానించారు. సెపక్‌తక్రా రాష్ట్రస్థాయి పోటీల్లో మనీషశుభశ్రీ (ప్రథమస్థానం), జిల్లా క్రికెట్ పోటీలో అనూష, ఖోఖోలో ఎస్.సంగీత, షార్ట్‌పుట్‌లో భవాని సత్తాచాటారు.

ఆక్యుపేషన్ సర్టిఫికెట్ తప్పనిసరి

మునిసిపల్ కమిషనర్ రాహుల్‌మీనా
నగరంలో పలు భవనాల పరిశీలన


నగరంలోని ఓ అపార్టుమెంట్ ప్లాన్‌ను పరిశీలిస్తున్న కమిషనర్

రాజమహేంద్రవరం సిటీ, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): ఆక్యుపేషన్ సర్టిఫికెట్ పొందాకే భవనాల్లోకి వాటి యజమానులు అడుగుపెట్టాలని మునిసిపల్ కమిషనర్ రాహుల్‌మీనా సూచించారు. సోమవారం ఆయన నగరంలోని ఈస్ట్ రైల్వేస్టేషన్ రోడ్డు, గాదాలమ్మ నగర్, పేపరుమిల్లు రోడ్డు ప్రాంతాల్లో పర్యటించి పలు భవనాలను తనిఖీ చేశారు. జీవో 119కు లోబడి నిర్మించిన రెండు రెసిడెన్షియల్ అపార్టుమెంట్స్ ఆక్యుపెన్సీ ఫైళ్లను తనిఖీ చేశారు.భవనాల్లో భూగర్భ జలాల పెంపునకు నిర్మించిన వర్షనీటి గుంతలు, భవనం ఎత్తు, సెట్ బ్యాక్‌లు,అపార్టుమెంట్ యాక్సెస్ కలిగిన రహదారి వెడల్పు పరిశీలించారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పరిపాలన నిబంధనలను పాటిస్తూ పట్టణ ప్రణాళికకు అనుగుణంగా భవన నిర్మాణాలు ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.అనుమతులు పొందిన భవన యజమానులు ఇచ్చిన ప్లాన్ ప్రకారమే నిర్మిస్తున్నారో లేదో సమగ్రంగా పరిశీలించాలన్నారు. భవన నిర్మాణం పూర్తయేంత వరకు బిల్డింగ్ ప్లాన్‌ను అక్కడ ప్రదర్శించాలన్నారు. ప్లానింగ్‌లో వ్యత్యాసాలుంటే చర్యలు తీసుకోవాలన్నారు. అనుమతులు లేకుండా భవనాలు నిర్మిస్తే నిబంధనల మేరకు నోటీసులు జారీ చేయాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ సిటీ ప్లానర్ పి.శ్రీనివాస్, ఇతర టౌన్ ప్లానింగ్ సిబ్బంది ఉన్నారు.

పీజీఆర్ఎస్‌కు 24 అర్జీలు

కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం జరిగిన పీజీఆర్ఎస్‌లో ప్రజల నుంచి 24 అర్జీలను కమిషనర్ స్వీకరించారు. బాధితులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. వాటి పరిష్కారానికి సంబంధిత విభాగానికి బదలాయించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పీజీఆర్ఎస్‌లో వచ్చిన అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి అర్జీదారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి చొరవ చూపాలన్నారు. అలాగే మీకోసం పోర్టల్ 1100 టోల్‌ఫ్రీ ద్వారా వచ్చే అర్జీలను వేగంగా పరిష్కరించాలని చెప్పారు. కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ వీవీ రామలింగేశ్వరరావు, డిప్యూటీ కమిషనర్ ఎస్.వెంకటరమణ, సెక్రటరీ జిశ్రైలజవల్లి, ఎస్ఈ ఇన్‌చార్జి రీటా, ఎంహెచ్‌వో డాక్టర్ వినూత్న, మేనేజరు ఎండీ అబ్దుల్‌మాలిక్, ఆర్వో సీహెచ్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కోతులు, కుక్కల నుంచి నగరాన్ని రక్షించండి

కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు టీకే

రాజమహేంద్రవరం సిటీ, నవంబరు10(ఆంధ్రజ్యోతి): కోతులు, కుక్కలు బెడద నుంచి నగరాన్ని రక్షించాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు టీకే విశ్వేశ్వరరెడ్డి కోరారు. ఈ మేరకు సోమవారం స్థానిక కార్పొరేషన్ కార్యాలయంలో అడిషనల్ కమిషనర్ వీవీ రామలింగేశ్వర్‌ను కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా టీకే మాట్లాడుతూ రానున్న పుష్కరాల నేపథ్యంలో రాజమహేంద్రవరానికి ఇప్పటి నుంచి చర్యలు చేపట్టాలని కోరారు. కోతులు, కుక్కలు, పందుల సమస్య ఉందని, అలాగే నగరంలో భిక్షాటన చేసే వారు కూడా ఎక్కువయ్యారని, వారి వల్ల కూడా ప్రజలు భయపడుతున్నారన్నారు. వీటిపై కమిషనర్ స్పందించాలన్నారు. కార్యక్రమంలో పీసీసీ మాజీ సెక్రటరీ బెజవాడ రంగా, జిల్లా ప్రధాన కార్యదర్శి చిన్నం మురళీకృష్ణ, ఎస్సీసెల్ ఛైర్మన్ బత్తిన చంద్రరావు, డాక్టర్ సెల్ ఛైర్మన్ డాక్టర్ రాజశేఖర్ పాల్గొన్నారు.

యూరియా కోసం రైతుల్లో ఆందోళన వద్దు

ఎమ్మెల్యే బలరామకృష్ణ


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బలరామకృష్ణ

కోరుకొండ, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): యూరియా కోసం రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ అన్నారు. మండలంలోని గాదరాడ గ్రామంలో సోమవారం నియోజకవర్గ సొసైటీల ఛైర్మన్లు, డైరెక్టర్లు, సీఈవోలు, మండల వ్యవసాయాధికారులు, ఏడీఏలతో ఆయన సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలో సరిపడా ఎరువులు అందుబాటులో ఉన్నాయని, యూరియా కోసం రైతులు ఆందోళన చెందనవసరం లేదన్నారు. సొసైటీల వారీగా యూరియా నిల్వలపై ఆయన ఆరా తీశారు. అధికారులు పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షించి, ఇబ్బందులుంటే తనకు తెలియజేయాలన్నారు. అవసరమైతే పరిస్థితిని వ్యవసాయ శాఖ మంత్రికి, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతామని ఎమ్మెల్యే చెప్పారు.

శివనామస్మరణతో మార్మోగిన ఆలయాలు


ఇళ్లపల్లి 108 స్తంభాల గుడిలో పాదరసలింగం

బిక్కవోలు, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం మూడో సోమవారం సందర్భంగా మండలంలోని శివాలయాలన్నీ శివనామస్మరణతో మార్మోగాయి. బిక్కవోలులోని గోలింగేశ్వరస్వామి ఆలయాన్ని తెల్లవారుజాము నుంచి భక్తులు బారులు దీరి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా గోలింగేశ్వరుని పంచామృతాలతో అభిషేకాలు జరిపి లక్ష బిల్వార్చన నిర్వహించారు. పార్వతి దేవికి లక్ష కుంకుమార్చన జరిపారు. ఇళ్లపల్లిలోని 108 స్తంభాల గుడిలో పాదరసలింగాన్ని దర్శించడానికి భక్తులు బారులు తీరారు. బంగారు వర్ణంతో దర్శనమిచ్చిన ఈ లింగాన్ని దర్శించుకున్నారు. భక్తులకు ఆలయ కమిటీ అధ్యక్షుడు తిలక్ అన్నప్రసాదాన్ని ఏర్పాటు చేసారు.

వైభవంగా కార్తీక దీపోత్సవం

అనపర్తి, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): అనపర్తిలోని ఉమా రామలింగేశ్వర స్వామి ఆలయంలో సోమవారం రాత్రి దీపోత్సవం వైభవంగా జరిగింది. ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి మహాలక్ష్మి దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించి ఆకాశ దీపాన్ని వెలిగించారు. అలాగే ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన దీపోత్సవాన్ని ఎమ్మెల్యే దంపతులు ప్రారంభించి దీపాలు వెలిగించారు.


అనపర్తిలో దీపోత్సవాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నల్లమిల్లి దంపతులు

అమరవీరులను నిత్యం స్మరించుకుందాం


అటవీ అమరవీరులకు నివాళులర్పిస్తున్న అధికారులు

దివాన్‌చెరువు, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో అటవీ సంరక్షణ కోసం ప్రాణాలర్పించిన అమరవీరులను నిత్యం స్మరించుకుందామని ఏపీఎఫ్‌డీసీ ఆర్ఎం శ్రీకాంత్‌నాథ్ రెడ్డి అన్నారు. లాలాచెరువులో సమీపంలోని గోదావరి మహాపుష్కరవనంలో రాష్ట్ర అటవీ అమరవీరుల సంస్మరణ దినాన్ని సోమవారం నిర్వహించారు. కార్యక్రమానికి విచ్చేసిన ఆర్ఎం మాట్లాడుతూ అమరవీరుల త్యాగాలను నిత్యం గుర్తుచేసుకోవాలన్నారు. జిల్లాలోని పలువురు అటవీ ఉద్యోగులు హాజరై అమరవీరులకు జోహార్లు అర్పించారు. కార్యక్రమంలో జిల్లా అటవీ అధికారి వి.ప్రభాకరరావు, డీఎఫ్‌వో ఎస్.శ్రీనివాస్ ఎఫ్ఆర్‌వో దావీదురాజు నాయుడు, పుష్కరవనం డీఆర్‌వో శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

అనపర్తి, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): ప్రతిఒక్కరూ ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని కుతుకులూరులో టీడీపీ నాయకుడు పులగం తిరుమలరెడ్డి ఆయన తండ్రి సూర్రెడ్డి జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆసుపత్రి వైద్యులు నేత్ర పరీక్షలు నిర్వహించగా డాక్టర్ నల్లమిల్లి సనాతని గైనిక్ సేవలందించారు. అలాగే డెంటల్, జనరల్ సర్జన్ వంటి సేవలందించారు. కార్యక్రమంలో సర్పంచ్ హేమతులసి, సొసైటీ అధ్యక్షుడు నల్లమిల్లి సుబ్బారెడ్డి, కర్రి శేషారత్నం, కూటమి నాయకులు పాల్గొన్నారు.

అందెశ్రీ మృతికి సంతాపం

రాజానగరం, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): ప్రజాకవి అందెశ్రీ ఆకస్మిక మృతి పట్ల గోదావరి గ్లోబల్ విశ్వవిద్యాలయం ఛాన్సలర్ కేవీవీ సత్యనారాయణరాజు(చైతన్యరాజు) సోమవారం తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. ఆసు కవిత్వంలో అందెశ్రీ దిట్టని, ఆయన మృతి తెలుగు సాహిత్య లోకానికి తీరని లోటన్నారు. అందెశ్రీతో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్న ఆయన, జీజీయూ ప్రాంగణంలో జరిగిన ప్రపంచ తెలుగు మహాసభలకు అందెశ్రీ హాజరై మాయమైపోతున్నాడమ్మా మనిషన్నవాడు అనే గేయాన్ని ఆలపించి అందరి హృదయాలను కదిలించారన్నారు. ఈ సందర్భంగా అందెశ్రీ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

బుర్రిలంకలో వనసమారాధన



కడియం, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): బుర్రిలంక ఈశ్వర ఫామ్ నర్సరీ గార్డెన్స్‌లో నర్సరీ అధినేత తాడాల విష్ణుచక్రవర్తి ఆధ్వర్యంలో కార్తీక వన సమారాధన సోమవారం ఏర్పాటు చేశారు. ముందుగా ఉసిరి చెట్టు వద్ద పూజలు నిర్వహించారు.కార్యక్రమంలో మాజీ మంత్రి చెల్లుబోయిన వేణు, మాజీ ఎంపీ గిరజాల వెంకటస్వామినాయుడు,మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, డీసీసీబీ మాజీ ఛైర్మన్ ఆకుల వీర్రాజు, డా. గూడూరి శ్రీనివాస్, యాదల స్టాలిన్, గిరజాల బాబు, చందన నాగేశ్వర్, కొత్తపల్లి శివాజీ, దాసరి శేషగిరి పాల్గొన్నారు.

విధులకు ఆటంకం కలిగించారని ట్రైనీ ఎస్ఐ ఫిర్యాదు

సీతానగరం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) సీతానగరం పోలస్ స్టేషన్‌లో విధులకు ఆటంకం కలిగించారంటూ ట్రైనీ ఎస్ఐ బి.సురేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు హెడ్ కానిస్టేబుల్ గోవిందరాజు సోమవారం తెలిపారు. వంగలపూడి పంచాయతీ పరిధిలోని చినవంగలపూడిలో ఈ నెల 8న జరిగిన శ్రీ గౌరిదేవి సంబరాలకు బందోబస్తు కల్పించాలని ఉత్సవ కమిటీ సభ్యులు కోరిన మీదట శనివారం గౌరిదేవి సంబరాలకు ట్రైనీ ఎస్ఐ సురేష్ తన సిబ్బందితో చినవంగలపూడి చేరుకున్నారు.అయితే సంబరాల్లో ఎటువంటి బందోబస్తు అవసరం లేదని పోలీసులు వెనక్కి వెళ్లిపోవాలని కమిటీ సభ్యులు అనడంతో తమ విధులు ఆటంకం కలిగించి అడ్డుకున్నారని ట్రైనీ ఎస్ఐ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. శ్రీగౌరిదేవి ఉత్సవ కమిటీ సభ్యులపై ఆదివారం రాత్రి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

రాష్ట్ర కాపు సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్‌గా చంటిబాబు



దివాన్‌చెరువు, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర కాపు సంక్షేమ అభివృద్ధి సంస్థ డైరెక్టర్‌గా రాజానగరం మండలం పాలచర్లకు చెందిన గంగిశెట్టి వీవీ సూర్య సత్యనారాయణ (చంటిబాబు) నియమితులయ్యారు. ప్రభుత్వం రాష్ట్రంలో మరోపది కార్పొరేషన్లకు డైరెక్టర్‌లను సోమవారం ప్రకటించింది. అందులో రాష్ట్ర కాపు కార్పొరేషన్‌కు 15 మంది డైరెక్టర్‌లను నియమించగా వారిలో రాజానగరం నియోజకవర్గం నుంచి చంటిబాబు నియమితులయ్యారు. టీడీపీ ఆవిర్భావం నుంచి ఉన్న చంటిబాబు పార్టీ మండలాధ్యక్షుడుగా, రాష్ట్ర కార్యదర్శిగా, 2024 ఎన్నికల్లో మండపేట పరిశీలకుడిగా, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కార్యవర్గ సభ్యుడిగా , చాగల్నాడు పథకం రైతుల కమిటీ డైరెక్టర్‌గా, గాడాల సొసైటీ అధ్యక్షుడిగా పదవులు నిర్వహించారు. తన నియామకం పట్ల సీఎం చంద్రబాబు, డీసీఎం పవన్‌కళ్యాణ్, మంత్రి లోకేశ్, ఎంపీ పురందరేశ్వరి, ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, రుడా ఛైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి లకు కృతజ్ఞతలు తెలిపారు.

కొత్త వంతెన నిర్మించాలని కలెక్టర్‌కు వినతి

గోకవరం, నవంబరు10(ఆంధ్రజ్యోతి): గోకవరంలోని రాణా సెంటర్ సమీపంలోని పురాతన వంతెన స్థానే కొత్తది నిర్మించాలని కోరుతూ జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరికి సోమవారం బీజేపీ నాయకులు వినతిపత్రం అందజేశారు. బ్రిటిష్ కాలంలో నిర్మితమైన ఈ ఇరుకు వంతెన వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా మారిందని, నిత్యం ఏదొక ప్రమాదం, ట్రాఫిక్ జామ్ కలుగుతుందని కలెక్టర్‌కు వివరించారు.ఈ విషయంపై కలెక్టర్ సానుకూలంగా స్పందించారన్నారు. కార్యక్రమంలో ఇనగోటి బాపన్నదొర, తామర్ల రాంబాబు, మామిడి అయ్యప్ప తదితరులు పాల్గొన్నారు.

కైవల్యరెడ్డికి కలెక్టర్ అభినందనలు



రాజమహేంద్రవరం అర్బన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): అమెరికాలోని ఫ్లోరిడాకు చెందిన టైటాన్స్ స్పేస్ ఇండస్ట్రీస్ సంస్థ 2029లో చేపట్టబోయే అంతరిక్షయాత్రలో ఆస్ట్రోనాట్ అభ్యర్థిగా ఎంపికైన తూర్పుగోదావరి జిల్లా నిడదవోలుకు చెందిన కైవల్యరెడ్డి సోమవారం కలెక్టర్ కీర్తి చేకూరిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కైవల్యరెడ్డిని కలెక్టర్ అభినందించారు. కైవల్యరెడ్డి సాధన జిల్లాకు మాత్రమే కాకుండా రాష్ట్రానికే గర్వకారణమని, భవిష్యత్తులో మరింత ఉన్నతశిఖరాలు అధిరోహించాలని కలెక్టర్ ఆకాంక్షించారు.


శ్రీప్రకాష్‌లో రిమ్‌జిమ్ వేడుకలు

దివాన్‌చెరువు, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): బాలల దినోత్సవం సందర్భంగా స్థానిక శ్రీప్రకాష్ విద్యానికేతన్‌లో రిమ్‌జిమ్(రోరింగ్ టాలెంట్స్) పేరుతో విద్యార్థులకు పోటీలు సోమవారం ప్రారంభమయ్యాయి. మూడురోజులు పాటు సంగీతం, సాహిత్యం, క్రీడలు, నటన, ఆర్ట్, క్రాఫ్ట్ అంశాల్లో పోటీలు జరుగుతాయి. పాఠశాల మేనేజర్ ఏఎస్ఎన్ మూర్తి పాఠశాల, జాతీయ పతాకాలను ఆవిష్కరించి క్రీడలను ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ విమల, వైస్ ప్రిన్సిపాల్ శ్రీలక్ష్మీ, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

సినిమా గైడ్

(రాజమహేంద్రవరం)

శ్యామల	: ఆర్యన్
సూర్యమినీ	: ఫీనిక్స్
సూర్యప్యాలస్	: ప్రిడేటర్
స్వామి	: జటాధర
అనుశ్రీ(సాయికృష్ణ)	: ప్రేమిస్తున్నా కె-ర్యాంప్
శివజ్యోతి	: ది గ్రేట్ ప్రీ వెడ్డింగ్ షో
రాజా	: జటాధర
ఊర్వశి	: తెలుసు కదా
మేనక	: కృష్ణలీల
రంభ	: ప్రిడేటర్
అప్సర	: ది గర్ల్ ఫ్రెండ్
అశోక	: మాస్ జాతర
వీఎస్ మహల్(నామవరం)	: ప్రిడేటర్
మురళీకృష్ణ(ధవళేశ్వరం)	: ది గర్ల్ ఫ్రెండ్
వెంకటసూర్య(కడియం)	: జటాధర
సత్యగౌరి (అనపర్తి)	: జటాధర
సూర్యశ్రీ (అనపర్తి)	: మాస్ జాతర
ఫార్చ్యూన్ సినిమాస్(రాజానగరం)	: మాస్ జాతర
రామకృష్ణ(కోరుకొండ)	: కాంతారా-1
గీతాసినిమాస్ (సీతానగరం)	: కాంతారా-1
శ్రీనివాస (గోకవరం)	: మాస్ జాతర
టీడీ సినీ మ్యాక్స్ (గోకవరం)	: బాహుబలి
లలితామహల్(రంపచోడవరం)	: కె-ర్యాంప్
నవయుగ(చింతూరు)	: కె-ర్యాంప్








కార్తీక దీపోత్సవం

పవిత్ర గోదావరి తీరం రాజమహేంద్రవరం కోటి లింగాల ఘాట్‌లో లక్ష దీపోత్సవం కన్నుల పండువగా సాగింది. ఉమాకోటిలింగేశ్వర స్వామి దేవస్థానం, పందిరి మహదేవుడు సత్రం, పంతం సత్యనారాయణ చారిటబుల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించారు. సోమవారం సాయంత్రం 6 గంటలకు కార్యక్రమం ప్రారంభించారు. ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు, ఎమ్మెల్సీ సోము వీర్రాజు, కమిషనర్ రాహుల్‌మీనా పాల్గొన్నారు.

హరోం..హర




రాజమహేంద్రవరం గోదావరిలో సోమవారం తెల్లవారుజామున 3 గంటల నుంచే పెద్ద ఎత్తున భక్తజనం కార్తీక పుణ్యస్నానాలు చేశారు. కోటిలింగాల రేవు, పుష్కరాల రేవు, టీటీడీ ఘాట్, సరస్వతి ఘాట్, గౌతమి ఘాట్లలో భక్తులు సాన్నాలు చేసి కార్తీక దామోదర పూజ చేసి దీపాలు వెలిగించి నదిలో విడిచిపెట్టారు. అనంతరం శివాలయాలకు చేరుకుని ప్రత్యేకాభిషేకాలు, అర్చనలు చేశారు. - రాజమహేంద్రవరం సిటీ



కమిషనర్ రాహుల్ మీనాకు సమస్యను వివరిస్తున్న రైల్వే స్టేషన్ మేనేజర్

రైల్వే స్టేషన్‌లో కుక్కలను పట్టించండి

కమిషనర్‌కు విన్నపం

రాజమహేంద్రవరం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): రాజమండ్రి రైల్వే స్టేషన్‌లో వీధి కుక్కలను నియంత్రించాలని కమిషనర్ రాహుల్ మీనాకు స్టేషన్ మేనేజర్ రంగనాథ్, సీటీఐ చంద్రమౌళి సోమవారం వినతిపత్రం అందజేశారు. రైల్వే స్టేషన్‌లోని వీధి కుక్కల నియంత్రణ లేకపోవడం వల్ల ప్రయాణికులు ప్రమాదాల బారిన పడుతున్నారని సోమవారం 'ఆంధ్రజ్యోతి' కథనంలో పేర్కొనడం గమనార్హం.ఇదిలా ఉండగా వీధి శునకాల వల్ల ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారని, ప్రమాదాలకు గురవుతున్నారని కమిషనర్‌కి స్టేషన్ మేనేజర్ తెలిపారు. ప్రయాణికుల భద్రత దృష్ట్యా తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు.

నేడు ఎఫ్ఎఫ్‌సీ వర్చువల్‌గా ప్రారంభించనున్న సీఎం

రాజమహేంద్రవరం నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ధవళేశ్వరం పారిశ్రామిక వాడలో ఏర్పాటు చేస్తున్న ప్లేటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్‌ను మంగళవారం ఉదయం సీఎం చంద్రబాబు వర్చువల్‌గా ప్రారంభించనున్నారు. అసెంబ్లీ నియోజకవర్గానికి ఒక ఎంఎస్ఎంఈ పారిశ్రామిక పార్కు స్థాపనలో భాగంగా ఈ ఫ్యాక్టరీ ఏర్పాటు చేస్తున్నారు. ఎమ్మెల్యే గోరంట్ల తదితరులు పాల్గొంటారు.



విజిట్రబుల్స్!

కూరగాయలు అధరహో

రాజమహేంద్రవరం అర్బన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : కార్తీకమాసం ఎఫెక్ట్ కూరగాయల ధరలపై పడింది.. ఒక్కసారిగా ఆకాశాన్నంటాయి. ఏ రకం చూసినా కిలో రూ.50లకు తక్కువ లేదు. అన్ని కూరగాయల ధరలు రూ.50ల పైనే పలుకుతున్నాయి. రైతు బజార్‌లో బెండకాయలు, దొండకాయలు, బీరకాయలు కిలో రూ.50ల చొప్పున విక్రయిస్తున్నారు. నల్ల వంకాయలు రూ.80ల వరకూ విక్రయిస్తున్నారు. తెల్లవంకాయలు కాస్త ధర తక్కువగా ఉన్నాయి. దీంతో రైతు బజార్‌కు వచ్చిన జనం ధరలు చూసి బేజారవుతున్నారు. సామాన్యులే కాదు మధ్యతరగతి వర్గాలు సైతం బెంబెలెత్తిపోతున్నారు. ఒకటికి రెండు సార్లు ధరలు తెలుసుకుంటున్నారు. బహిరంగ మార్కెట్లో కిలో వంకాయలు రూ.100పైనే పలుకుతుంటే ఇతర కూరగాయలు సైతం కిలో రూ.80 నుంచి రూ.100ల వరకూ విక్రయిస్తున్నారు. కనీసం పావుకిలో కొందామన్నా ఏ కూరగాయ కూడా రూ.25లకు తక్కువకు రావడంలేదు. ఈ ధరలు చూసి ప్రజలకు నోటమాట రావడంలేదు. బహిరంగ మార్కెట్లతో పోల్చితే రైతు బజార్లలో ధరలు కాస్త తక్కువగానే ఉన్నా కూరగాయల నాణ్యతపై ప్రజలు పెదవి విరుస్తున్నారు.నచ్చులు, పుచ్చులు తప్ప అక్కడేమీ ఉండడంలేదనే విమర్శలు వస్తున్నాయి. కార్తీకమాసానికి తోడు ఇటీవలి మొంథా తుఫాన్ దెబ్బ కూరగాయల ధరలపై పెను ప్రభావం చూపుతోందనే చెప్పాలి. ఆకుకూరల పరిస్థితి దారుణంగా ఉంది. మొంథా తుఫాన్ దెబ్బకు పాదు కూరలన్నీ తుడుచుపెట్టుకుని పోవడం, ఇతర కూరగాయల మొక్కల పువ్వు, పిందె రాలిపోవడం ధరలు భారీగా పెరుగుదలకు ప్రధాన కారణంగా రైతులు చెబుతున్నారు.

మరో నెల ఇంతేగా..

బీర, బెండ, దొండ, ఆనప వంటి పాదు కూరలు, టమోటా, ఇతర కూరగాయల పం టలు మొన్నటి మొంథా తుఫాన్ దెబ్బకు తుడిచిపెట్టుకుపోవడంతో సీతానగరం, కడియం మండలాల్లో కూరగాయలు సాగు చేసే రైతులు ఇప్పుడిప్పుడే మళ్లీ కొత్తగా నార్లు పోస్తున్నారు. వాతావరణ పరిస్థితులన్నీ అనుకూలించి ఇవన్నీ కాపునకు వచ్చేసరికి ఎంతలేదన్నా నెలరోజులు పైనే పడుతుందని చెబుతున్నారు. తాళ్లపూడి మండలం పెద్దేవంలో ఆకు కూరలసాగు పెద్దఎత్తున జరుగుతుంది. తుఫాన్ వర్షాల దెబ్బతో ఒక్క గోంగూర మినహా ఇతర అన్ని ఆకుకూరలు, కొత్తిమీర, పుదీనా పూర్తిగా ధ్వంసమైంది. లోకల్ టమోటా నారు కుళ్లిపోయింది. రైతులు మళ్లీ నారు పోస్తున్నారు. నిజానికి నవంబరు నుంచి లోకల్ టమోటా మార్కెట్లోకి రావాల్సి ఉంది. ఇది కూడా ఆలస్యం కానుంది. లోకల్‌గా కూరగాయల దిగబడులు లేకపోవడం,రావులపాలెం, మడికి చుట్టుపక్కల గ్రామాల్లో పండించే సరుకు ఒక్కటే ఇక్కడి అన్ని మార్కెట్లకు రావడంతో డిమాండ్ పెరిగి ధరలు తారస్థాయికి చేరుతున్నాయి.మరో నెలరోజులు కూరగాయాలు తప్పేలా లేదని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

బహిరంగ దోపిడీ

రిటైల్ మార్కెట్లలో ధరలు ఇష్టారాజ్యంగా ఉన్నాయి. సెమీ హోల్‌సేల్ మార్కెట్లలో కిలో వంకాయల ధర రూ.100లు ఉంటే రిటైల్ మార్కెట్లలో పావు కిలో రూ.30లకు విక్రయిస్తున్నారు. అంటే కిలో రూ.120. బీరకాయలు, బెండకాయలు, దొండకాయల ధరలు అనూహ్యంగా పెరిగి కిలో రూ.80పైనే ఉన్నాయి. టమాటా కిలో రూ.40 ధర ఉన్నా నాణ్యత ఉండడంలేదు. అరటికాయల ధర పెరిగిపోయింది. మీడియం సైజులో ఉండే రెండు కాయలు రూ.25లు చెబుతున్నారు. రైతు బజార్లలో కూరగాయల నాణ్యత ఎంత తక్కువ చెప్పుకుంటే అంత మంచిది. ధర తక్కువైనా నాణ్యత లేకపోవడంతో ప్రజల్లో అసంతృప్తి వ్యక్తమవుతోంది.

- కూరగాయలకు కార్తీకం ఎఫెక్ట్
- భారీగా పెరిగిన ధరలు
- ఏ రకమైనా కిలో రూ.50పైనే
- కిలో వంకాయ రూ.100
- బహిరంగ మార్కెట్‌లో దోపిడీ
- కొనుగోలుదారులు లబోదిబో



12 ఎకరాల ప్రభుత్వ భూమి ఆక్రమించారని కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న బీజేపీ నాయకులు

పీజీఆర్ఎస్‌కు 185 అర్జీలు

రాజమహేంద్రవరం రూరల్ నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలు పరిష్కార దిశగా అధికారులు పనిచేయాలని కలెక్టర్ కీర్తి చేకూరి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో 185 అర్జీలు స్వీకరించినట్టు తెలిపారు. ప్రజలు తమ అర్జీలను డివిజన్, మండల స్థాయిలో ఉన్న అధికారులకు అందజేస్తున్నా ఫలితం లేకపోవడం వల్ల కలెక్టరేట్‌కు వస్తున్నారన్నారు. జిల్లా రెవెన్యూ అధికారులు బాధ్యతగా వ్యవహరించాలన్నారు. కార్యక్రమంలో జేసీ మేఘస్వరూప్,డీఆర్వో సీతారామమూర్తి, సీపీవో అప్పలకొండ, డీఎల్‌డీవో వీణాదేవి పాల్గొన్నారు.

12 ఎకరాల ప్రభుత్వ భూమి ఆక్రమణ..

కొవ్వూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): తుపాకులగూడెం సర్వే నెంబరు 264 ప్రభుత్వ భూమిలో చేపట్టిన అక్రమ కట్టడాలను తొలగించాలని బీజేపీ నాయకులు సోమవారం జిల్లా కలెక్టర్‌కు విన్నవించారు.తాళ్లపూడి మండలం పోచవరం, తుపాకులగూడెం గ్రామంలో సర్వే నంబరు 264లో 12 ఎకరాల ప్రభుత్వ భూమిని కొంత మంది వ్యక్తులు ఆక్రమించుకుని అక్రమ కట్టడాలు నిర్మాణం చేపట్టారన్నారు. ప్రశ్నించిన వారిపై అట్రాసిటీ కేసులు పడతానని బెదిరిస్తున్నారన్నారు. రాజకీయ నాయకుల అండదండలతో ప్రభుత్వ భూమిని ఆక్రమించుకోవడంతో పాటు ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో ఆ కట్టడాలకు సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టారన్నారు.స్థానిక తహశీల్దార్‌కు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడంతో కలెక్టరేట్‌కు వచ్చామన్నారు. అక్రమ కట్టడాలను తొలగించి, నిర్మాణం చేపట్టిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. 12ఎకరాల ప్రభుత్వ అనాక్రాంతం కాకుండా చర్యలు చేపట్టాలన్నారు.ఉపాధి నిధులు దుర్వినియోగం చేసిన అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కె.వెంకట సత్యానారాయణ, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

ఎస్పీ గ్రీవెన్స్‌కి 40 ఫిర్యాదులు

రాజమహేంద్రవరం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం పబ్లిక్ గ్రీవెన్స్ నిర్వహించారు. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి 40 అర్జీలను ఎస్పీ నరసింహ కిశోర్ స్వీకరించి సమస్యలపై ఆరా తీశారు. సంబంధిత స్టేషన్ బాధ్యులతో ఫోన్‌లో మాట్లాడి సత్వరమే చట్ట పరిధిలో పరిష్కారం చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీలు ఎన్‌బీఎం మురళీకృష్ణ, ఏవీ సుబ్బరాజు పాల్గొన్నారు.

మొంథా నష్టంపై ప్రభుత్వానికి నివేదిక



చిట్యాలలో తుఫాన్ బాధిత రైతులతో మాట్లాడుతున్న కేంద్ర బృంద సభ్యులు, కలెక్టర్ కీర్తి తదితరులు

మొంథా తుఫాన్ నష్టాలపై కేంద్రం బృందం పర్యటన

రాజమహేంద్రవరం/గోపాలపురం,నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో మొంథా తుఫాన్ నష్టాలపై ప్రభుత్వానికి నివేదిక ఇస్తామని కేంద్ర బృందం ప్రకటించింది.కలెక్టరేట్‌లో సోమవారం రాత్రి జిల్లాలో జరిగిన నష్టంపై సమీక్షించింది.కలెక్టర్ కీర్తి చేకూరి ఆధ్వర్యంలో తుఫాన్ ప్రభావిత నష్టాలకు సంబంధించిన ఫొటో ప్రదర్శనను కేంద్ర బృందం తిలకించింది. కేంద్ర బృందం సభ్యుడైన కేంద్ర వ్యవసాయ రైతు సంక్షేమ శాఖ డైరెక్టర్ కె.పొన్నుస్వామి మాట్లాడుతూ చిట్యాల గ్రామం సహా పలు గ్రామాల్లో పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయన్నారు. రైతులు ఇబ్బందులను కేంద్ర ప్రభుత్వానికి నివేదిస్తామన్నారు. సీడబ్ల్యుసీ డైరెక్టర్ శ్రీనివాస బైరి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా యంత్రాగం ప్రాణ నష్టం జరుగకుండా సమర్థవంతంగా వ్యవహరించారన్నారు. కలెక్టర్ కీర్తి చేకూరి జిల్లాలో నష్టాలు వివరించారు. జిల్లాలో వ్యవ సాయ, ఉద్యాన శాఖలకు భారీ నష్టం వాటిల్లిందన్నారు. జిల్లాలో 17 మండలాలు, 3 పట్టణాల పరిధిలో 653 గ్రామాలకు చెందిన 27,140 మంది ప్రజలు తుఫాన్ వల్ల నష్టపోయారన్నా రు. జిల్లాలో 31,074 మంది రైతులకు చెందిన 15665 హెక్టార్లలో పంట నష్టం జరిగిందని తెలిపారు. అందులో 14529 హెక్టార్లలో వరి పంట, 1135 హెక్టార్లలో మినుము పంట దెబ్బతిందని 2802 హెక్టార్లలో ఉద్యాన పంటలు దెబ్బతిన్నాయన్నారు. విద్యుత్ శాఖకు సంబంధించి 45 సబ్‌స్టేషన్లు, 470 విద్యుత్ స్తంభాలు 270 ఎల్‌టీ లైన్లు, ఫీడర్లు దెబ్బతిన్నాయన్నారు. ఎర్రకాలువ ప్రవాహం వల్ల తీవ్ర నష్టం జరిగిందని తెలిపారు. మొత్తం 21 ప్రాంతాల్లో కాల్వలు, రేవులు, రోడ్డు మార్గాలు దెబ్బతిన్నాయని తెలిపారు.గోపాలపురం మండలం చిట్యాల, వెంకటాయపాలెం గ్రామాల్లో 540 హెక్టార్లలో పంట నష్టం జరిగిందని తెలిపారు. కొవ్వాడ కాల్వ కారణంగా గత 30 ఏళ్లుగా పంటను నష్టపోతున్నారని బృందం దృష్టికి తీసుకెళ్లారు. సీఈఈఏ డిప్యూటీ డైరెక్టర్ ఆర్తీ సింగ్, గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ ఏడీ మనోజ్ కుమార్ మీనా, తదితర కేంద్ర బృంద సభ్యులు పర్యటించారు. వారి వెంట రాష్ట్ర అధికారి డిల్లీ రావు, జేసీ మేఘా స్వరూప్, ఆర్డీవో రా ణి సుష్మిత,జిల్లా వ్యవసాయాధికారి ఎస్.మాధవరావు, సివిల్ సప్లయిస్ మేనేజర్ గణేశ్‌కుమార్,ఏవో ఏసుబాబు,ఎస్ఐమనోహర్ ఉన్నారు.

ఎక్కడికక్కడ హై అలర్ట్




రాజమహేంద్రవరంలో సోమవారం అర్ధరాత్రి తనిఖీలు చేస్తున్న పోలీసులు

రాజమహేంద్రవరం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): డిల్లీలో బాంబు పేలుళ్ల నేపథ్యంలో దేశ వ్యాప్తంగా హై అలర్ట్ ప్రకటించడంతో జిల్లాలోని పోలీసులు అప్రమత్తమయ్యారు. జిల్లా కేంద్రంతో పాటు, జిల్లాలోకి ప్రవేశ, నిర్గమ మార్గాల్లో హుటాహుటిన చెక్‌పోస్టులను ఏర్పాటు చేశారు. వాహనాలను క్షణ్ణంగా తనిఖీలు చేశారు. డాగ్ స్క్వాడ్, బాంబ్ డిస్పోజల్ స్క్వాడ్‌లను రంగంలోకి దింపారు. అనుమానిత ప్రదేశాల్లో కలియ తిరిగారు. అనుమానితులను ప్రశ్నిస్తున్నారు. మరోవైపు రైల్వే స్టేషనులో ఆర్పీఎఫ్, జీఆర్పీ పోలీసులు తనిఖీలు చేపట్టారు.

అనుమానం వస్తే కాల్ 112 : ఎస్పీ



జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో అప్రమత్తం చేశాం. ప్రత్యేక బృందాలను రంగంలోకి దించాం. విస్తృతంగా వాహన తనిఖీలు చేస్తున్నాం. అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే 112కి ఫోన్ చేయాలి. అనవసర వదంతులు వద్దు.



వెరీ.. వెరీ.. గుడ్డు

కార్తీకంలోనూ అధరహో



మండపేట, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ఎన్నడూ లేనిది కార్తీకమాసంలో గుడ్డు ధర పరుగులు పెడుతోంది. ప్రతి ఏడాది కార్తీకమాసంలో గుడ్డు ధర తక్కువగా ఉండేది. ఎందుకంటే ఈ మాసంలో శాకాహారులు ఎక్కువగా ఉంటారు. దీంతో ఎప్పుడూ గుడ్డు ధర తక్కువగా ఉండేది. అయితే దానికి భిన్నంగా ఈ ఏడాది మాత్రం పరుగులు పెడుతోంది. కోళ్ల ఫారాల నిర్వాహకులకు లాభాలు పండిస్తుంటే సామాన్యుడు మాత్రం గుడ్డు తినలేని పరిస్థితి కనిపిస్తోంది. గత రెండేళ్ల పాటు పౌల్ట్రీ పరిశ్రమ ఒడిదుడుకులు చెందగా ఇప్పుడిప్పుడే పరిశ్రమ కుదుటపడుతోంది. గతంలో పరిశ్రమ నష్టాల కారణంగా చాలా మంది రైతులు కోళ్ల ఫారాలను మూసివేశారు.కొంతమంది అయితే బ్యా చ్‌లు వేయలేదు. గతంలో అయితే బ్యాచ్‌లు వేసి గుడ్ల ఉత్పత్తి చేసేవారు. ప్రస్తుతం ఉత్పత్తి తగ్గడంతో డిమాండ్‌కు సరిపడా సరుకు లేకపోవడంవల్ల ధరలు పెరుగుదలకు కారణ మని నిర్వాహకులు చెబుతున్నారు. ఒక గుడ్డు ఉత్పత్తికి రూ.4.80 పైసలు అవుతుంది. రూ.5 దాటి ధర ఉంటేనే గిట్టుబాటు ఉంటుందని పౌల్ట్రీ రైతులు అంటున్నారు.

- ఒక్కో గుడ్డు హోల్‌సేల్ రూ.6
- రిటైల్‌లో రూ.7కి విక్రయం
- ధరలకు రెక్కలు
- వినియోగదారులకు చుక్కలు
- పౌల్ట్రీ రైతులకు ఊరట
- కూరగాయలతో పోటీ
- లాభాల్లో రైతాంగం

గుడ్డు ధర ఊరట



ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 300 వర కు కోళ్ల ఫారాలు ఉన్నాయి. వీటిలో 1.40 కోట్ల మేర కోళ్లను పెంచుతున్నారు.రోజుకు 1.10 కోట్ల మేర గుడ్ల ఉత్పత్తి జరుగుతోంది. 40 శాతం స్థానిక అవసరాలకు వినియోగిస్తుండగా 60 శాతం గుడ్లు పొరుగు రాష్ట్రాలైన ఒడిశా, బిహార్, పశ్చిమ బెంగాల్ తదితర రాష్ట్రాలకు ఎగుమతులు జరుగుతుంటాయి. ప్రభుత్వం అంగన్‌వాడీలు, పాఠశాలలు, వసతిగృహాలు, ఆస్పత్రుల్లో గుడ్లు అందిస్తోంది. ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, బేకరీలు, ఇంట్లోని వంటకాల్లో కూరలకు గుడ్లు విరివిగా వాడుతున్నారు. గుడ్డు భలే ఫుడ్ అన్నట్టుగా మారింది. డిమాండ్‌కు తగ్గట్టుగా గుడ్ల ఉత్పత్తి లేకపోవడంతో పాటు శీతాకాలం కావడంవల్ల వినియోగం పెరిగిందని నిర్వాహకులు చెబుతున్నారు. కొన్నేళ్లుగా కోళ్ల పరిశ్రమ నష్టాల్లో కూరుకుపోగా ఇప్పుడు కాస్తంత పెరిగిన గుడ్డు ధర ఊరటనిస్తోందని పౌల్ట్రీ నిర్వాహకుడు తాడి శేషారెడ్డి తెలిపారు. కాసింత లాభాలు చూస్తున్నామన్నారు.

గతేడాది రూ.5.65

కార్తీకమాసంలో కాయగూరల ధరలు ఆకా శాన్నంటుతున్నాయి. కనీసం గుడ్డు కొనుగోలు చేసి కూర వండుకుందామంటే బయట రూ.7 నుంచి రూ.7.50 వరకు విక్రయిస్తున్నారు. దీంతో గుడ్డు కూడా తినలేని పరిస్థితి నెలకొందని వినియోగదారులు వాపోతున్నారు. గతేడాది నవంబరులో గుడ్డు ధర రూ.5.65 ఉండగా ఇప్పుడు ఇదే మాసంలో రూ.6కి చేరింది. చిల్లరగా గుడ్డు ధర బయట మార్కెట్‌లో రూ.6.50 నుంచి రూ.7లకు వరకు విక్రయిస్తున్నారు.మొత్తం మీద కార్తీకంలో గుడ్డు ధర నిర్వాహకులకు ఊరటనిస్తుంటే కొనుగోలుదారులకు మాత్రం నీరసం కలిగిస్తోంది.

రాయితీలు కల్పించాలి

పరిశ్రమలో కోళ్లకు వాడే మేతల ధరల పెరుగుదల, మందుల ధరలు పెరగడం భారంగా మారిందని నిర్వాహకులు చెబుతున్నారు. కోళ్ల మేతలకు సంబంధించి ముడిసరుకు ధరలు పెరగడం తమకు భారంగా మారాయని నిర్వాహకులు చెబుతున్నారు. 2019లో ముడిస రుకు ధరలు తక్కువ ఉండడం వల్ల లాభాలు వచ్చాయని అంటున్నారు. ఇప్పుడు పెరిగిన దాణాల ధరలు తమకు భారంగా మారాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పొరుగు రాష్ట్రాలైన యూపీ, వెస్ట్ బెంగాల్, ఒడిస్సా తదితర రాష్ట్రాల్లో సబ్సిడీలు ఇస్తుండగా ఇక్కడ మాత్రం ఇవ్వడం లేదు. దానివల్ల ఇక్కడ రైతులు మార్కెట్ ధరపైనే ఆధారపడాల్సి వస్తోంది. పొరుగు రాష్ట్రాల్లా ఇక్కడా ప్రభుత్వం కోళ్లపరిశ్రమలకు రాయితీలు కల్పించాలని, ముడిసరుకు ధరల నియంత్రణకు చర్యలు తీసుకుని ఆదుకోవాలని పౌల్ట్రీ నిర్వాహకులు విజ్ఞప్తి చేస్తున్నారు.

విద్యార్థులకు సన్మానం

దేవరపల్లి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): యర్న గూడెం జీజేసీలో చదువుతున్న విద్యార్థినులు పలు క్రీడల్లో ప్రతిభ సాధించడంతో సోమవారం కళాశాల ప్రిన్సిపాల్ చత్రపతి శివాజీ వారిని సన్మానించారు. ఇటీవల జరిగిన సెపక్‌తక్రా రాష్ట్రస్థాయి పోటీల్లో మనీషశుభశ్రీ (ప్రథమస్థానం), జిల్లా క్రికెట్ పోటీలో అనూష, ఖోఖోలో ఎస్.సంగీత, షార్ట్‌పుట్‌లో భవాని సత్తాచాటారు. కళాశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ గద్దే శ్రీనివాస్, వైస్ ప్రిన్సిపాల్ వీరసత్యం పాల్గొన్నారు.

సోమేశ్వరుడికి విశేష పూజలు


పూజలందుకున్న సోమేశ్వరస్వామి

నిడదవోలు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో వేంచేసి వున్న బాలా త్రిపుర సుందరి సమేత సోమేశ్వర స్వామి ఆలయంలో సోమవారం విశేష పూజలు, అభిషేకాలు జరిపారు.కార్తీక సోమవారం పరమ పవిత్ర పర్వదినం కావడంతో తెల్లవారుజాము నుంచే ఆలయ ప్రధాన అర్చకులు శ్రీకాకుళపు లక్ష్మీ నరసింహశాస్త్రి ఆధ్వర్యంలో వేదపండితులు సోమేశ్వరస్వామికి విశేష అభిషేకాలు నిర్వహించారు. సాయంకాలం ఆలయంలో ఆకాశ దీపానికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో భక్తులు, తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న బాలికలకు పరామర్శ


బాలికలను పరామర్శిస్తున్న జవహర్, తదితరులు

తాళ్లపూడి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): వేగేశ్వరపురం ఉన్నత పాఠశాల వద్ద ఇటీవల బైక్ ఢీకొట్టిన ప్రమాదంలో తీవ్రంగా గాయపడి తాళ్లపూడిలోని శ్రీసాయి స్ఫూర్తి హాస్పటల్‌లో చికిత్స పొందుతున్న బాలికలను రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ కేఎస్ జవహర్ సోమవారం పరిమర్శించారు. హాస్పటల్ వైద్యుల నుంచి వారి ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. దీనిలో భాగంగా తాడిపూడి టీడీపీ నాయకుడు నామా సురేంద్రకుమార్ బాధితులకు రూ. 6000 ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో వేగి సత్యనారాయణ (చిన్ని). ఆత్కూరి రాంబాబు, సిద్దన రాధాకృష్ణ, పసలపూడి సుబాష్ చంద్రబోస్, చిట్టిబాబు, తదితరులు పాల్గొన్నారు.

రాగోలపల్లి సొసైటీ అధ్యక్షుడు ప్రసాద్‌కి పితృవియోగం


పరమేశ్వరరావు భౌతికకాయానికి నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి, తదితరులు

తాళ్లపూడి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): రాగోలపల్లి సొసైటీ అధ్యక్షుడు అనపర్తి ప్రసాద్‌కు సోమవారం పితృవియోగం జరిగింది. ఆయన తండ్రి, సీనియర్ టీడీపీ నేత అనపర్తి పరమేశ్వరరావు (80) మృతిచెందారు. పార్టీ స్థాపించిన నాటి నుంచి పార్టీకి సేవలందిస్తూ వచ్చారు. ఆయన గ్రామ సర్పంచ్‌గా, ఎంపీటీసీగా పలుసేవలు అందించారు. ఈయన మృతికి పలువురు టీడీపీ నేతలు సంతాపం తెలిపారు. సమాచారం అందుకున్న ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు విచ్చేసి పరమేశ్వరరావు మృతదేహానికి నివాళులర్పించారు.

పాఠశాలల వద్ద పోలీసుల తనిఖీలు


వాహనదారుల ధ్రువపత్రాలు పరిశీలిస్తున్న ఎస్ఐ రామకృష్ణ

తాళ్లపూడి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు పాఠశాలలు, కళాశాలల వద్ద సోమవారం పోలీసుల తనిఖీలు ప్రారంభించారు. ఇటీవల వేగేశ్వరపురం ఉన్నత పాఠశాల వద్ద కొంతమంది విద్యార్థులను బైక్ ఢీకొన్న సందర్భంలో దీన్ని ఏర్పాటు చేశారు. అలాగే పలు ప్రదేశాల్లో ఎస్ఐ టీ. రామకృష్ణ తన సిబ్బందితో మోటారు సైకిళ్లు, బైక్‌లను నిలిపి పూర్తిస్థాయిలో విచారణ జరిపారు.

విజన్ -2047 లక్ష్యంగా పనిచేయండి : ప్రత్యేకాధికారి


అధికారులతో మాట్లాడుతున్న నియోజకవర్గ ప్రత్యేకాధికారి భాగ్యవతి

గోపాలపురం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన విజన్ - 2047 లక్ష్యంగా మండలస్థాయి అధికారులు పని చేయాలని నియోజకవర్గ ప్రత్యేకాధికారి భాగ్యవతి అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో సోమవారం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో రాజమనోహర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ప్రత్యేకాధికారి భాగ్యవతి మాట్లాడుతూ ప్రభుత్వం స్వర్ణాంధ్ర - 2047 లక్ష్యంగా ముందుకు వెళ్తోందన్నారు. కార్యక్రమంలో ఏఎస్‌వో జోడాల వెంకటేశ్వరరావు, ఈవోపీఆర్‌డీ సుజాత, ఏవో మంగతాయారు, ఏపీఎం రోజ్‌మాణిక్యం, ఏపీవో రమణ, తదితరులు పాల్గొన్నారు.

మహాలింగేశ్వరుడ్ని దర్శించుకోవడం ఆనందదాయకం

• అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు


గౌరీపట్నంలో అయ్యన్నకు పూర్ణకుంభంతో స్వాగతం పలుకుతున్న ఆలయ కమిటీ సభ్యులు

దేవరపల్లి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): గౌరీపట్నంలోని శ్రీగౌరీసమేత పురాతన మహా లింగేశ్వర స్వామివారిని దర్శించుకోవడం ఆనందదాయకమని అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు అన్నారు. సోమవారం ఆయన తన కుటుంబ సభ్యులతో కలిసి ఆలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయనకు వేద పండితులు, ఆలయ కమిటీ సభ్యులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. దీనిలో భాగంగా స్పీకర్ అయ్యన్న, పద్మావతి దంపతులు, ఆయన కుమారుడు విజయ్, సువర్ణ దంపతులు, రాజేశ్, దివ్య దంపతులు ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు దేవేంద్ర దీక్షిత్ శర్మ ఆలయ అంతరాలయంలో వేదమంత్రాలతో పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో కొవ్వూరు ఆర్డీవో రాణీసుస్మిత, ఆలయ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

శివనామస్మరణతో మార్మోగిన గోష్పాదక్షేత్రం


సుందరేశ్వరస్వామికి అభిషేకాలు చేస్తున్న పండితులు

కొవ్వూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : కార్తీకమాసం మూడో సోమవారం గోదావరి తీరంలోని శైవ క్షేత్రాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. పట్టణ, పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు వేకువజాము నుంచే తరలివచ్చారు. ఈ సందర్భంగా నదిలో పుణ్యస్నానాలు ఆచరించారు. ప్రధాన స్నానఘట్టాలలో ఉన్న శివలింగాలకు నదీ జలాలతో అభిషేకాలు చేశారు. మహిళలు అరటి డొప్పలలో కార్తీక దీపాలు వెలిగించి నదిలో విడిచిపెట్టారు. క్షేత్రంలో ఎటువంటి అవాంచనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పట్టణ సీఐ పి.విశ్వం ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

ఉండ్రాజవరం: మండలంలో పలు శివాలయాలు వద్ద కార్తీక సోమవారం పూజలు నిర్వహించారు. స్వామివారికి దీపారాధనతోపాటు అభిషేకములు భక్తులు నిర్వహించారు. పాలంగి క్షీరరామలింగేశ్వరస్వామి ఆలయం వద్ద ఉదయం అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారికి పూజలు చేశారు. చివటం రైల్వే గేటు సమీపంలోను, పాలంగి శివాలయం వద్ద భక్తులు ఉసిరి చెట్టువద్ద పూజలు చేశారు.

పేదలకు దుస్తుల పంపిణీ


తాడిపర్రులో పంపిణీ చేస్తున్న దృశ్యం

ఉండ్రాజవరం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): తాడిపర్రులో గారపాటి సుబ్బారావు ఆర్థిక సహాయంతో సోమవారం పేదలైన వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు అన్నదానం, దుస్తులు, పండ్లు పంపిణీ చేశారు. కార్తీక మాసం సందర్భంగా సుబ్బారావు పేదలకు తనవంతు సహాయంగా వీటిని అందించారు. అవకాశం ఉన్న వారు తమకు తోచిన సహాయం పేదలకు అందిస్తే వారికి ఆసరాగా ఉంటుందని దాత సుబ్బారావు చెప్పారు. కార్యక్రమం గ్రామపెద్దల సమ క్షంలో జరిగింది. కార్యక్రమంలో గ్రామసర్పంచ్ కరుటూరి నరేంద్రబాబు, గ్రామపెద్దలు వాకలపూడి సత్యనారాయణ, మల్లిన సత్యనారాయణ, సుంకవల్లి కోటియ్య, గారపాటి కృష్ణమూర్తి, పి. శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపిక


ఎంపికైన గోపాలపురం హైస్కూల్ విద్యార్థులు

గోపాలపురం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు గోపాలపురం జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులు ఎంపికైనట్టు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వెంకట కనకపద్మ తెలిపారు. సోమవారం దేవరపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఇటీవల జరిగిన జిల్లా స్థాయి అండర్-14,17 బాలబాలికల విభాగంలో విద్యార్థులు తమ సత్తా చాటారన్నారు. దీంతో బాలిక విభాగంలో వర్షిత, జీ. దుర్గానాగేశ్వరి, సాలి హెలీన, బాలురు జీ. రాజ్‌కుమార్, ఈశ్వర్‌సాయి, శ్రీనివాస్ రాష్ట్ర స్థాయిలో పోటీలకు ఎంపికై తమ పాఠశాలకు గుర్తింపు తెచ్చారన్నారు. ఎంపికైన విద్యార్థులను ఉపాధ్యాయులు, తదితరులు అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైభవంగా కార్తీక దీపోత్సవం

అనపర్తి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : కార్తీకసోమవారాన్ని పురస్కరించుకుని అనపర్తిలోని ఉమా రామలింగేశ్వర స్వామి ఆలయంలో సోమవారం రాత్రి దీపోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, మహాలక్ష్మి దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించి ఆకాశ దీపాన్ని వెలిగించారు.

బాక్సింగ్ పోటీల్లో కార్తికేయకు గోల్డ్‌మెడల్


కార్తికేయను అభినందిస్తున్న అధ్యాపక బృందం

నిడదవోలు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ఎస్వీఆర్కే కళాశాలలో డిగ్రీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న బీ. కార్తికేయ ఆదికవి నన్నయ వర్సిటీ పరిధి రాజోలు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరిగిన బాక్సింగ్ పోటీల్లో పాల్గొని గోల్డ్‌మెడల్ సాధించాడని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.జ్యోతి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీంతో వచ్చేనెల 15,16 తేదీల్లో హర్యానాలోని కురుక్షేత్ర యూనివర్సిటీలో జరిగే ఆల్ ఇండియా బాక్సింగ్ పోటీల్లో పాల్గొంటాడని తెలిపారు. ఈ సందర్భంగా కార్తికేయను కళాశాల అధ్యాపక బృందం, విద్యార్థులు అభినందించారు.

డివిజనల్ పీజీఆర్ఎస్‌కు 10 ఫిర్యాదులు

కొవ్వూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : డివిజనల్ ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్ - మీకోసం)లో 10 ఫిర్యాదులు స్వీకరించినట్టు కొవ్వూరు ఆర్డీవో కార్యాలయ కేఆర్‌సీ తహశీల్దార్ పి.అచ్యుతకుమారి తెలిపారు. సోమవారం ఆర్డీవో కార్యాలయంలో డివిజనల్ స్థాయి ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అచ్యుతకుమారి మాట్లాడుతూ పీజీఆర్ఎస్‌లో ప్రజల నుంచి స్వీకరించిన ఫిర్యాదుల పరిష్కారంలో నూటికి నూరుశాతం నాణ్యతతో పాటు పూర్తి స్పష్టత ఉండాలన్నారు. కార్యక్రమంలో వివిధ డివిజనల్ స్థాయి అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్గానిక్ ఫార్మింగ్‌తో ఆరోగ్యవంతమైన సమాజం

• కొవ్వూరు ఆర్డీవో రాణీసుస్మిత



కార్యక్రమంలో పాల్గొన్న ఆర్డీవో రాణీసుస్మిత

కొవ్వూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఆర్గానిక్ ఫార్మింగ్‌తో ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించవచ్చని కొవ్వూరు ఆర్డీవో రాణీ సుస్మిత అన్నారు. సోమవారం కొవ్వూరు ఆర్డీవో కార్యాలయంలో ఆర్డీవో రాణీసుస్మిత ఆధ్వర్యంలో ధర్తి మాత బచావో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ ఆర్గానిక్ ఫార్మింగ్ చేయడం వల్ల మన ఆరోగ్యం, మన కుటుంబాల ఆరోగ్యం కాపాడుకోవచ్చునన్నారు. రైతులు ఫెర్టిలైజర్స్ రసాయనాలు అధికంగా వాడడం వల్ల పర్యావరణం, మానవ జీవనశైలి దెబ్బ తింటుందన్నారు. కార్యక్రమంలో డివిజనల్ వ్యవసాయ సహాయ సంచాలకులు శ్రీనివాస్, మండల వ్యవసాయాధికారి ఏ.గంగాధర్, కోఆపరేటివ్ సబ్ రిజిస్ట్రార్ కె.సుబ్బారావు, ఎరువుల కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

'పరీక్షా కేంద్రాల్లో మౌలిక వసతులు ఉండాల్సిందే'


ఊనగట్ల హస్కూల్‌ను సందర్శించిన డీఈవో అమల కుమారి

చాగల్లు, నవరంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలో పదో తరగతి పబ్లిక్ పరీక్షలు నిర్వహించే మూడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఎం. అమల కుమారి సోమవారం పరిశీలించారు. అనంతరం ప్రధానోపాధ్యాయులు, విద్యాశాఖ అధికారులతో మాట్లాడుతూ పరీక్ష కేంద్రాల్లో మౌలిక వసతులు ఉండేలా చూడాల్సిందేనన్నారు. పరీక్షలు రాసే విద్యార్థులు ఆనందకరమైన వాతావరణంలో రాసేలా ఏర్పాట్లు చూడాలన్నారు. జిల్లా అధికారుల ఆదేశాల మేరకు పరీక్ష కేంద్రాలను పరిశీలించినట్టు చెప్పారు. అనంతరం పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎంఈవో కేవీఎస్ రామాంజనేయులు, విద్యాకార్యాలయ సిబ్బంది ఉమామహేశ్వరరావు, ప్రధానోపాధ్యాయులు వాసవి, ఎన్‌వీ రమణ, రమణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

కైవల్యరెడ్డికి కలెక్టర్ అభినందనలు


కైవల్యరెడ్డిని అభినందిస్తున్న కలెక్టర్ కీర్తి చేకూరి

రాజమహేంద్రవరం అర్బన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) :అమెరికాలోని ఫ్లోరిడాకు చెందిన టైటాన్స్ స్పేస్ ఇండస్ట్రీస్ సంస్థ 2029లో చేపట్టబోయే అంతరిక్షయాత్రలో ఆస్ట్రోనాట్ అభ్యర్థిగా ఎంపికైన తూర్పుగోదావరి జిల్లా నిడదవోలుకు చెందిన కైవల్యరెడ్డి సోమవారం కలెక్టర్ కీర్తి చేకూరిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కైవల్యరెడ్డిని కలెక్టర్ అభినందించారు. కైవల్యరెడ్డి సాధన తూర్పుగోదావరి జిల్లాకు మాత్రమే కాకుండా యావత్తు రాష్ట్రానికే గర్వకారణమని, భవిష్యత్‌లో మరిన్ని ఉన్నతశిఖరాలు అధిరోహించాలని కలెక్టర్ ఆకాంక్షించారు. పలువురు పాల్గొన్నారు.

సెంట్రల్ జైలులో ఇద్దరు జీవిత ఖైదీలకు క్షమాభిక్ష

ఆమోదం తెలిపిన క్యాబినెట్

రాజమహేంద్రవరం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అర్హులైన జీవిత ఖైదీలకు క్షమాభిక్ష ప్రసాదించింది. సోమవారం జరిగిన మంత్రి మండలి సమావేశంలో 27వ అంశంగా హోంశాఖలోని జైళ్లశాఖ చెందిన అంశాన్ని ప్రవేశపెట్టారు. దీనిలో ముగ్గురు జీవిత ఖైదీలకు క్షమాభిక్ష కల్పించాల్సి ఉంది. దీనికి జీవో ఎంఎస్ నెం.71 నిర్దేశించిన ప్రకారం మంత్రి మండలి ఆమోదం తెలిపింది. దీనిలో భాగంగా తూర్పుగోదావరి జిల్లా రాజమండ్రి సెంట్రల్‌లో జీవిత ఖైదు అనుభవిస్తున్న మధిరి సువర్ణరాజు, కటికిరెడ్డి నాగేశ్వరరావు విడుదల కానున్నారు. తూర్పుగోదావరి జిల్లా బిక్కవోలు మండలం కొమరిపాలేనికి చెందిన నాగేశ్వరరావు ఓ రైస్ మిల్లులో పని చేస్తుండేవాడు. కలెక్షన్ ఏజెంట్‌ను హత్య చేసి సొమ్ము దోపిడీ చేశారనే నేరంపై రాజమండ్రిలోని కోర్టు జీవిత ఖైదు విధించగా 2011 మార్చి 21న జైలుకు వచ్చాడు. ఇతడు ఇప్పటి వరకూ పర్లో, పేరోల్‌పై బయటకు కూడా వెళ్లలేదు. అలాగే కృష్ణా జిల్లా గుడ్లవల్లేరు మండలం చంద్రాల గ్రామానికి చెందిన మదిరి సువర్ణరాజు భార్యను హత్య చేసిన కేసులో 2010 జూలై 15 నుంచి జైలులో శిక్ష అనుభవిస్తున్నాడు. ఇతడి ప్రవర్తన ఆధారంగా సెమీ ఓపెన్ ఎయిర్ జైలు అర్హత పొందాడు. అయితే ప్రభుత్వం జీవో 2రోజుల్లో ఇచ్చే అవకాశం ఉంది. ఆ జీవో ఆధారంగా వీళ్లిద్దరూ స్వేచ్ఛా వాయువులు పీల్చుకొని కుటుంబాల చెంతకు చేరనున్నారు.

జాతీయ లోక్ అదాలత్‌లో కేసులు పరిష్కారమవ్వాలి

పీడీజే గంధం సునీత


సమావేశంలో అధికారులకు సూచనలు ఇస్తున్న సునీత

రాజమహేంద్రవరం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): జాతీయలోక్ అదాలత్‌లో రాజీకి యోగ్యమైన కేసులు పెద్ద సంఖ్యలో పరిష్కారం కావాలని ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్‌పర్సన్ గంధం సునీత ఆదేశించారు. డిసెంబరు 13న నిర్వహించనున్న జాతీయ లోక్‌అదాలత్‌ని పురస్కరించుకుని న్యాయమూర్తులతో సోమవారం ఆమె సమావేశమయ్యారు. కేసుల పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై దిశానిర్దేశం చేశారు. పెండింగ్‌లో ఉన్న కేసుల జాబితాను డీఎల్ఎస్ఏకి అందజేయాలని సూచించారు. అనంతరం ఉమ్మడి జిల్లా ఎక్సైజ్ అధికారులతో సమావేశం నిర్వహించి తగు ఆదేశాలిచ్చారు. డీఎల్ఎస్ఏ కార్యదర్శి ఎన్.శ్రీలక్ష్మి, నాలుగు జిల్లాల ఎక్సైజ్ అధికారులు పాల్గొన్నారు.

హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు

గోకవరం, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదుతో పాటు రూ.15,000 జరిమానా విధిస్తూ రాజమహేంద్రవరం 9వ అదనపు జిల్లా కోర్టు జడ్జి తీర్పు వెలువరించినట్టు ఎస్ఐ పి.పవన్‌కుమార్ తెలిపారు. గోకవరం మండలం బావాజీపేటకి చెందిన విరోతి శ్రీను భార్యతో అదే గ్రామానికి చెందిన బలిజ శ్రీను వివాహేతర సంబంధం ఏర్పరచుకున్నాడు. ఈ క్రమంలో విరోతి శ్రీను అడ్డును తొలగించుకోవాలనే ఉద్దేశంతో 2020 డిసెంబరు 30న తెల్లవారుజామున 5.30 గంటలకు పొలం పనుల నిమిత్తం బలిజ శ్రీను విరోతి శ్రీనును రంపయర్రంపాలెం తోటలోకి తీసు కెళ్లాడు. అక్కడ బండ రాయితో శ్రీనును తల పై కొట్టి హత్య చేశాడు. ఈ సంఘటనపై మృతుడి సోదరుడు విరోతి అప్పారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అప్పట్లో ఎస్ఐగా పని చేసిన పి.చెన్నారావు కేసు నమోదు చేయగా అప్పటి కోరుకొండ సీఐ పి.ఈ.పవన్‌కుమార్‌రెడ్డి నిందితుడిని అరెస్ట్ చేసి కేసు దర్యాప్తు అనంతరం కోర్టులో చార్జ్‌సీటు దాఖలు చేశారు. తదనంతరం నేరం రుజువు కావడంతో బలిజ శ్రీనుకు జీవిత ఖైదు, రూ.15,000 జరిమానా విధిస్తూ రాజమహేంద్రవరం 9వ అదనపు జిల్లా కోర్టు జడ్జి ఎం.మాధురి తీర్పు ఇచ్చినట్టు ఎస్ఐ పవన్‌కుమార్ తెలిపారు.

రద్దీగా రత్నగిరి..


వ్రతాలు ఆచరిస్తున్న భక్తులు

అన్నవరం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుడి సన్నిధి కార్తీక సోమవారం పర్వదినం పురస్కరించుకుని భక్తజనంతో నిండిపో యింది. రద్దీ నేపథ్యంలో ఒంటిగంట నుంచి వ్రతాలు, రెండుగంటల నుంచి సర్వదర్శనాలు ప్రారంభమయ్యాయి. సోమవారం ఒక్కరోజు 8645 జంటలు వ్రతాలు ఆచరించుకోగా వివిధ విభాగాల ద్వారా సుమారు రూ.85 లక్షల ఆదాయం ఆలయానికి లభించింది. భక్తులకు అసౌకర్యం కలగకుండా ఈవో సుబ్బారావు, చైర్మన్ రోహిత్ వేర్వేరు ప్రదేశాల్లో ఉండి పర్యవేక్షణ చేస్తూ ఏర్పాట్లు చేశారు. దర్శనం అనంతరం మహిళా భక్తులు రావిచెట్టు వ ద్ద కార్తీకదీపాలు వెలిగించారు. సత్యదేవ నిత్యాన్నదాన ప. థకం ద్వారా 30 వేలమందికి నిరంతరాయంగా ఉచిత పులిహోర పంపిణీ చేశారు.

పెనుగొండ క్షేత్ర పీఠాధిపతి పూజలు

సత్యదేవుడి సన్నిధిలో పెనుగొండ క్షేత్ర పీఠాధిపతి శ్రీ ప్రజానంద సరస్వతి బాలాజీ స్వామిని దర్శించి ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఆయనకు ఈవో వీర్ల సుబ్బారావు ఆలయ మర్యాదలతో ఘనస్వాగతం పలికారు. దర్శనానంతరం వేదపండితులు వేదాశీర్వచనాలు అందజేశారు.

రూ.లక్ష విరాళం

సత్యదేవ నిత్యాన్నదాన పథకానికి వీరంపాలెనికి చెందిన బొల్లారెడ్డి రామకృష్ణారెడ్డి రూ. లక్ష విరాళాన్ని ఈవో వీర్ల సుబ్బారావుకు అంద జేశారు. దాతను ఆయన అభినందించి వారికి ప్రసాదం, ప్రత్యేక దర్శన సౌకర్యాలు కల్పించారు.

ఈతలో ప్రతిభ కనబరుస్తున్న విద్యార్థి హయగ్రీవ


గోదావరిలో ఈత కొడుతున్న హయగ్రీవ

కొవ్వూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): కొవ్వూరు పట్టణానికి చెందిన 10వ తరగతి విద్యార్థి డీఎస్ఎస్‌టీ హయగ్రీవ ఈతలో ప్రతిభ చూపుతున్నాడు. గత అక్టోబరు 26వ తేదీన రాజమహేంద్రవరం పద్మావతినగర్‌లోని ఆర్ఎంసీ ఫుల్‌లో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో 50 మీటర్ల బ్రెస్ట్‌స్ట్రోక్‌లో విజేతగా నిలిచి బంగారు పతకం దక్కించుకున్నాడు. అలాగే 100 మీటర్ల బ్రెస్ట్‌స్ట్రోక్‌లో ద్వితీయస్థానాన్ని కైవసం చేసుకుని వెండి పతకం సాధించాడు. అలాగే నవంబరు 2వ తేదీన కాకినాడలో జరిగిన ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల స్థాయి సెలెక్షన్స్‌లో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. నవంబరు 22, 23 తేదీల్లో వైజాగ్‌లో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీలకు సిద్ధపడుతున్నాడు. ఈతలో హయగ్రీవ వేగానికి చేపలు కూడా అలసిపోయి వెనుకబడి పోతున్నాయని పలువురు కొనియాడుతున్నారు. తండ్రి శిక్షణలో గోదావరి జలాలపై సాధన చేస్తూ ఈతలో ప్రతిభ కనబరుస్తున్న హయగ్రీవకు ప్రోత్సాహం అందించినట్టయితే అంతర్జాతీయ పోటీలో ప్రతిభ చాటుతానని చెబుతున్నాడు. గోదావరి పరీవాహక ప్రాంతాన్ని టూరిజం సర్క్యూట్‌తో పాటు స్విమ్మింగ్ సర్క్యూట్‌గా కూడా అభివృద్ధి చేయాలని కోరుతున్నాడు.